## ఎస్ఆర్ఎం బీటెక్ లో హెల్త్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్

మంగళగిరి, జూన్ 29, ప్రభాతవార్త : ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఆగస్టు నుంచి బీటెక్ లో హెల్త్ ఇంజినీరింగ్ ప్రోగ్రాము ప్రారంభించడానికి సమాయత్తమైంది. ఇందుకోసం అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసింది. ప్రత్యేకంగా హెల్త్ ఇంజినీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేసి డాక్టర్ కేపీ సునీతను విభాగాధిపతిగా నియమించింది. అంతేకాకుండా హెల్త్ ఇంజినీరింగ్ ప్రోగ్రాము విజయవంతంగా నిర్వహించేందుకు దోహదపడేలా పారిశ్రామిక రంగాల ప్రముఖులను ఆహ్వానించి వారి నుంచి విలువైన సూచనలు తీసుకునేందుకు వర్సిటీలో హెల్త్ కేర్ ఇండస్ట్రీ సమ్మేళనాన్ని నిర్వహించింది. ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా ఉన్న 13 ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు,




పారిశ్రామికవేత్తలు హాజరై హెల్త్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్కు అవసరమైన సూచనలు, సలహాలను అందజేశారు. హెల్త్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కేపీ సునీత అధ్యక్షతన జరిగిన సదస్సును ఉద్దేశించి యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడారు. ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీలో హెల్త్ ఇంజినీరింగ్ ప్రోగ్రామ్ను ప్రవేశపెట్టడంలో గల ఉద్దేశాన్ని వివరించి టెక్నాలజీ పరంగా సమగ్ర సహకారాన్ని అందించాలని పారిశ్రామిక రంగ ప్రముఖులను కోరారు. ఈ సందర్భంగా కృత్రిమ మేథ ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రాజెక్టులు, పరిశోధనలు, ఇంటర్న్షిప్ అవకాశాలపై పలువురు మాట్లాడారు. విద్యాప్రమాణాలతో పాటు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులను ప్రవేశపెట్టడంలో యూనివర్సిటీ కనబరుస్తున్న చొరవను డీన్ డాక్టర్ సీవీ టామి వివరించారు. పాఠ్య ప్రణాళిక తయారీలో సహకారం అందిస్తామని పారిశ్రామిక రంగ నిపుణులు, టెక్నాలజీ రంగ ప్రముఖులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీనివాసన్ తిరుమలై, పంకజ్ బల్వేరియా, యూనివర్సిటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతం:ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనోక్ బాబు

తెనాలి జూన్29(ప్రభాతవార్త): ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికి నూరు శాతం పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పినపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు తెలిపారు. జాతీయ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు సోమవారం ఆలపాటినగర్ , పినపాడు,సుందరయ్య నగర్ తదితర ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 05 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పరిశపోగు హనోక్ బాబు మాట్లాడుతూ,పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయించుకొనని వారిని ఇంటింటికి తిరిగి చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తద్వారా పోలియో రహిత భారత దేశ నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో యుయల్ బి సబ్ యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రమౌళి,శ్రీకంఠ ఉమాకాంత్ ఆరోగ్య సిబ్బంది ఆశావర్కర్లు బి .శ్రీలత,నర్సింగ్ కళాశాల విద్యార్థులు భార్గవి ,నిఖిత పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాల అమ్మితే చట్టపరమైన చర్యలు

నగరం ,జూన్ 29, ప్రభాతవార్త: నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి వి. రమేష్ బాబు అన్నారు. సోమవారం విత్తనాల దుకాణాలను తనిఖీ నిర్వహించి విత్తనాలను నాణ్యత పరీక్ష కొరకు విత్తన పరీక్ష కేంద్రాలకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు లైసెన్సులు ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరూ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని, తీసుకున్న బిల్లు పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. విత్తనాలు ఏదైనా సమస్య వచ్చినప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. రైతు సేవ కేంద్రంలో సబ్సిడీపై వరి విత్తనాలు బిపిటి 52 04, ఎం టి యు 10 61, ఎం టి యు 1224 రకాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాలు కావలసినవారు కేజీకి 5 రూపాయలు చొప్పున ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకుని విత్తనాలు కొనుగోలు చేయాలని తెలిపారు. మండలంలోని ఎరువుల దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలు మాత్రమే అమ్మాలని నకిలీ విత్తనాలు అమ్మ రాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. నాగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామకంఠం స్థల కబ్జాపై ఫిర్యాదు..

గుంటూరు, జూన్ 29, ప్రభాతవార్త : ప్రత్తిపాడు నియోజకవర్గం, గుంటూరు రూరల్ మండలం, లాల్పురం గ్రామంలో గ్రామ కంఠం స్థలం కబ్జాకు గురైందని ఆ ప్రాంత దళితులు సోమవారం గుంటూరు పిజిఆర్ఎస్ లో జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేశారు. లాలుపురం గ్రామ దళితులు తెలిపిన వివరాల మేరకు..బాబు జగజ్జీవన్ రామ్ కాలనీకి చెందిన మేము మా తాత, ముత్తాతల తరముల నుండి డప్పు వాయిద్య కళాకారులుగా ఉంటూ ఇక్కడే నివసిస్తున్నామన్నాము. ఒకే గృహంలో రెండు, మూడు కుటుంబాల నివసిస్తూ కాలం వెళ్ళదీస్తున్నామన్నారు. మాకు నివేశన స్థలాలు కావాలని ఎన్నో మార్లు రాజకీయ నాయకులకు, అధికారులకు విన్నవించుకోవడం జరిగిందని వివరించారు. ఇప్పటికే మేము డప్పు కళాకారులుగానే ఉంటూ ఇరుకు గృహాలలో పిల్లలు, వృద్ధులతో కలిసి జీవిస్తూనే ఉన్నాము. మా కాలనీ ప్రక్కనే గ్రామ కంఠం, సర్వే నంబర్ 355, 358 లో సుమారు 75 సెంట్ల విస్తీర్ణంలో ఖాళీ స్థలము ఉందని చెప్పారు. ఈ గ్రామ కంఠం స్థలంలో అర్హులైన మాకు నివేశన స్థలాలు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యేకు, జిల్లా అధికారులకు అర్జీలు పెట్టి ఉన్నట్లు చెప్పారు. ఈ గ్రామకంఠం స్థలం మా కాలనీకి, ముత్యాల సాంబశివరావు, మట్టం రాజా పొలమునకు ఆనుకొని ఉందని పేర్కొన్నారు. మట్టం రాజా అనే వ్యక్తి తన పొలమునకు ఆనుకొని ఉన్న గ్రామకంఠ స్థలాన్ని ఆక్రమించి, చుట్టూ ఫెన్సింగ్ వేసి, కాలనీవాసులను ఆ స్థలంలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నా దని వాపోతున్నారు. ఈ విషయం స్థానిక అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. పై విషయాన్ని విచారించి నివేశన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలైన మాకు కబ్జాకు గురైన గ్రామకంఠ స్థలాన్ని సర్వేచేసి, అర్హులైన వారికి నివేశన స్థలాలు మంజూరు చేసి, న్యాయం చేకూర్చాలని కోరుతున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎల్.బిక్షాలు, జె. శ్యాంబాబు, కె.రవికుమార్, జె.గోపి, బి.చార్లెస్, ఎన్.కార్తీక్ బాబు, ఎల్ నాగయ్య కె.నవీన్ కుమార్, కె.దేవదాసు, తదితరులు ఉన్నారు

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

గుంటూరు క్రైమ్,జూన్29,ప్రభాతవార్త: ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ను మరింత బలోపేతం చేయడం,వారి ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించడం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోందని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా ప్రజల నుంచి వినతులు 181 ఫిర్యాదులను స్వీకరించి వాటి వివరాలను పరిశీలించారు.ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు తెలియజేసే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభిస్తోందన్నారు.ఫిర్యాదుల పరిష్కారంలో పోలీస్



అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని,ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా విచారించి న్యాయమైన పరిష్కారం అందించాలని ఎస్పీ సూచించారు.ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా స్పందించడం పోలీస్ శాఖ బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు.కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే ఆన్లైన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి,నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించి వారి అభిప్రాయాన్ని తీసుకోవాలని స్పష్టం చేశారు.ఫిర్యాదుదారులకు తెలియజేయకుండా ఎలాంటి ఫిర్యాదును కూడా మూసివేయరాదని,ఒకసారి వచ్చిన సమస్య మళ్లీ పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు ఫిర్యాదుల నమోదు ప్రక్రియలో పోలీస్ సిబ్బంది పూర్తి సహకారం అందించారు. ఈ సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్,సాయి నగర్,గుంటూరు ఆధ్వర్యంలో స్వామి జ్ఞాన ప్రసన్న గారి నేతృత్వంలో సుమారు 200 మంది ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు,వృద్ధులు,పేదవారికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా నిలిచిందని ఎస్పీ తెలిపారు.
సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వామ్యమైన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి (అడ్మిన్), ఏ. హనుమంతు (ఏఆర్),డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి (మహిళా పోలీస్ స్టేషన్),ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్,పిజిఆర్ఎస్ సీఐ బిలాలుద్దీన్,ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## పంట భూముల్లో సిరుల పంట పండాలి

సత్తెనపల్లి, జూన్ 29, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గం ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసనసభ్యులుకన్నా లక్ష్మీ నారాయణ మరియు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందు భూమి పూజ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం విస్తారమైన వర్షాలతో నదులన్ని నిండి పంట భూముల్లో సిరుల పంట పండాలని రైతన్నల ఇంకా పండగ వాతావరణం వెల్లివిరవాలని



కోరుకుంటున్నానుఅన్నదాత చేపట్టే ప్రతి కష్టం విజయవంతం కావాలిపాడిపంటలతో రైతన్నల ఇళ్లల్లో వెలుగులు నిండాలి రైతు సోదరులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలుసకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలిరైతు సంక్షేమం వ్యవసాయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందిసత్తెనపల్లి రూరల్ మండలం కొమెరపూడి గ్రామంలో. ఏరువాక పౌర్ణమి సందర్భంగా.భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన. సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు. కన్నా మరియు పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## తోట చిన్న సాంబయ్యకు లయన్స్ ఉత్తమ అవార్డు




సత్తెనపల్లి, జూన్ 29, ప్రభాతవార్త: ఒంగోలు లో జరిగిన జిల్లా 316 అవార్డ్స్ ఫంక్షన్ లో 2025. 2026 రీజియన్ చైర్మన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన తోట చిన్న సాంబ శివయ్య ఉత్తమ ద్వితీయ రీజియన్ చైర్మన్ గా జిల్లా గవర్నర్ ఎం జె ఎఫ్ చందోలు హరిప్రసాద్ రావు నుండి అవార్డు లయన్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్ నుండి అప్రిసియేషన్ అవార్డ్ ఒంగోలు జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు సందర్భంగా క్లబ్ సత్తెనపల్లి సభ్యులు స్నేహితులు. మిత్రులు హృదయపూర్వక అభినందనలు తెలియచేసినారు.

## విద్యా ప్రగతిలో మరో కీలక మైలురాయి

**ఎంపీ శ్రీ కృష్ణ దేవరాయలు చేతుల మీదుగా పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం**

**సత్తెనపల్లిలో 11వ తరగతి ప్రారంభోత్సవం మరియు ప్రతిభావంతుల సత్కారం**

సత్తెనపల్లి, జూన్ 29, ప్రభాతవార్త: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం సత్తెనపల్లిలో సోమవారం 11వ తరగతి (ఇంటర్మీడియట్ ) తరగతి ను పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా యన్.సి.సి, స్కౌట్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు."ఒక చెట్టు – అమ్మ పేరుతో" కార్యక్రమంలో భాగంగా ఎంపీ మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 11వ తరగతిని అధికారికంగా ప్రారంభించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. పాఠశాల పరిశుభ్రత, క్రమశిక్షణ, ఆహ్లాదకరమైన ప్రాంగణం, విద్యా ప్రమాణాలు




మరియు వినూత్న కార్యక్రమాలను అభినందించారు. విజ్ఞానం, క్రీడలు మరియు సహపాఠ్య కార్యక్రమాలలో విద్యాలయం సాధిస్తున్న విజయాలను కొనియాడారు. విద్యార్థుల ప్రతిభను, ఉపాధ్యాయుల అంకితభావాన్ని మరియు విద్యాలయ ఉపాధ్యాయుల సమిష్టి కృషిని ప్రశంసిస్తూ, ప్రిన్సిపాల్ జగదీశ్ కుమార్ గుప్తా ని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా పలు రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను సత్కరించారు. సౌజన్య ఏఐ (కృత్రిమ మేధస్సు)లో 93 పిఐ సాధించినందుకు ప్రశంసాపత్రం అందజేశారు. సత్యం కు ఆంగ్లంలో 85 పిఐ సాధించినందుకు ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి శంకర్ ను కూడా ప్రశంసాపత్రంతో సత్కరించారు.అండర్–17 వాలీబాల్ పోటీలలో విజేతలుగా నిలిచి రీజినల్ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు షీల్డ్లు మరియు పతకాలు అందజేశారు. 9వ తరగతి విద్యార్థి శ్లోక్ గుప్తా భారత ప్రభుత్వ ఖిఇన్స్పైర్–మనక్ఖి అవార్డు కింద ..10,000 ప్రోత్సాహక నగదు అందుకున్న సందర్భంగా ప్రత్యేకంగా సత్కరించారు. స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర పురస్కారానికి ఎంపికైన విద్యార్థులు మరియు వారి ఇన్చార్జ్ బజరంగ్ భీల్ ని కూడా ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అదేవిధంగా, ప్రిన్సిపాల్ జగదీశ్ కుమార్ గుప్తా ను సామాజిక సేవ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి మరియు విశిష్ట నాయకత్వానికి గుర్తింపుగా స్టూడెంట్ డెవలప్మెంట్ సొసైటీ తరపున ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరించారు.అనంతరం ప్రిన్సిపాల్ జగదీశ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు కు , అతిథులకు, తల్లిదండ్రులకు మరియు హాజరైన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యాలయం భవిష్యత్తులో కూడా నాణ్యమైన విద్య, నవాచారం మరియు విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం విద్యాలయ చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోగా, 11వ తరగతి ప్రారంభంతో విద్యాలయం విద్యా ప్రగతిలో మరో కీలక మైలురాయిని చేరుకుంది.

## ఓవర్టేక్ చేస్తూ ఘోర ప్రమాదం ..ఒకరు మృతి

సత్తెనపల్లి, జూన్ 29, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు బొలెరో వాహనాన్ని ఓవర్టేక్ చేసే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బొలెరో కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్లో సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి: బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల,జూన్29,ప్రభాతవార్త,ప్రతినిధి:పోలీస్ స్టేషన్లకు వచ్చే వృద్ధులు, మహిళలు, విభిన్న ప్రతిభావంతుల పట్ల సిబ్బంది మానవీయ కోణంలో వ్యవహరించాలని, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఎస్పీఉమామహేశ్వర్ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా



జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 36 మంది అర్జీదారులు కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలు, వరకట్న వేధింపులకు సంబంధించిన తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులతో స్వయంగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ లో మాట్లాడి, చట్టపరిధిలో విచారణ జరిపి తక్షణమే న్యాయం చేయాలని ఆదేశించారు.పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా విచారించి పరిష్కరించాలన్నారు.అర్జీల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం ప్రదర్శించినా సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. బాధితుల సమస్యలపై తీసుకున్న చర్యలకు సంబంధించిన పూర్తి నివేదికను జిల్లా పోలీస్ కార్యాలయానికి తక్షణమే పంపాలని ఆదేశించారు.ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## .ఓటరు మ్యాపింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి.. తహసిల్దార్ వెంకటస్వామి.

కాకుమాను, జూన్ 29, ప్రభాత వార్త : ఓటరు డిజిటలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ బి. వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంశంపై స్థానిక తహసీ ల్దార్ కార్యాలయంలో వెలుగు సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు, బిఎల్వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ..ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువును పాటించడం అత్యంత కీలకమని, నిర్లక్ష్యం చేస్తే ఎన్నికల సంఘం నుంచి షోకాజ్ నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రక్రియ ప్రారంభమై ఇప్పటికే సుమారు 15 రోజులు గడిచాయని, కేవలం 14–15 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలో ఓటర్ల డిజిటలైజేషన్, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతిరోజు కనీసం 8 నుంచి 10శాతం మేర పురోగతి సాధించాలని తెలియజేశారు. చివరి రోజుల్లో కొంతమంది ఓటర్లకు సంబంధించిన వివరాల ధృవీకరణ, పత్రాల పరిశీలన వంటి పనులకు అదనపు సమయం అవసరమవుతుందని, అలాగే ప్రక్రియలో ఏవైనా లోపాలు తలెత్తితే వాటిని సరిదిద్దేందుకు కూడా రెండు నుంచి మూడు రోజుల సమయం కేటాయించాల్సి ఉంటుందని, అందువల్ల ముందస్తు ప్రణాళికతో వేగవంతంగా పనిచేసి, గడువుకు ముందుగానే డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని బిఎల్ఓ లను ఆదేశించారు. బీఎల్ఓలు, అంగన్వాడీలు, వెలుగు సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి డిజిటలైజేషన్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలన్నారు. రెవిన్యూ ఇన్స్పెక్టర్, వెలుగు సిబ్బంది, అంగనవాడి కార్యకర్తలు, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.
ఫోటో రైటప్: ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్న దృశ్యం.

## ప్రైవేటు భూమిలో మట్టి తోడేళ్లు.

### పల్లపాడులో మట్టి అక్రమార్కుల దోపిడీని ఆపేదెవరు?

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 29, ప్రభాతవార్త : మట్టి మాఫియా రాజ్యమేలుతుంది. జెసిబిలు, ట్రాక్టర్లు వినియోగించి పెద్ద ఎత్తున ప్రైవేటు లేఅవుట్లకు, ఇళ్ల స్థలాలకు, పల్లపు భూములకు మెరక చేసుకునేందుకు తరలించి సొమ్ము చేసుకుంటుంది. అధికారుల అలసత్వాన్ని అడ్డుపెట్టుకొని రూ.లక్షలు గడిస్తున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో మట్టిని పెద్దఎత్తున తరలిస్తున్న చర్యలు లేకపోవడంపై స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టిచెరుకూరు మండలంలోని పల్లపాడు, కొర్నెపాడు, లేమల్లెపాడు, ముట్లూరు, కోవెలమూడి, తదితర గ్రామాలలోని చెరువుల్లో నీరు ఉండడంతో అక్రమార్కుల చూపు డ్రైనేజ్ కాలువలు, వాగు పోరంబోకు స్థలాలపై పడి నిలువునా మట్టి మింగేస్తున్నారు. గతంలో రాత్రి వేళల్లో మట్టిని చాటుమాటుగా తరలించేవారు. ప్రస్తుతం అక్రమార్కులు పట్టపగలే బహిరంగంగా



పనికానిచ్చేస్తున్నారు. వందల ట్రాక్టర్లతో మట్టిని తరలించి ఒక్కొక్క ట్రాక్టర్ కు దూరాన్ని బట్టి రూ.1300 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు. ఈ రకంగా రోజుకు లక్షల రూపాయలు అక్రమార్జన చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వానికి ఒక్కపైసా రుసుము చెల్లించకుండానే తమపని కానిచ్చుకుంటున్నారు.
..మండలంలోని పల్లపాడు గ్రామానికి చెందిన ఓవ్యక్తి మిర్చి వ్యాపారం చేయడానికి గ్రామానికి చెందిన కొంతమంది సన్నకారు రైతుల వద్ద నుండి పెద్ద మొత్తంలో డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులతో వ్యాపారం చేస్తూ ఉన్న క్రమంలో అప్పులు సవిచూ డాల్సి వచ్చిందని బాధితుడు తెలుపుతున్నాడు. అప్పులు ఇచ్చినవారు బాధితుడిపై ఒత్తిడి తేవడంతో, అప్పుల వారికి సరైన సమాధానం చెప్పలేక తన పేరుతో ఉన్న ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని ఐపిపెట్టి కోర్టులో పిటీషన్ దాఖలు చేసుకున్నాడు. దీనితో అప్పులు ఇచ్చిన వారు అగ్గిమీద గుగ్గిలమై మాకు సరైన సమాధానం చెప్పకుండా, డబ్బులు ఇవ్వకుండా, కోర్టులో పిటిషన్ వేయటం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనితో డబ్బులు ఇచ్చిన రైతులు మొత్తం ఏకమై, రుణదాత వ్యవసాయ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా రాత్రి పగళ్ళు మట్టి తోలకాలు జరుపుతున్నారు. ఈ భూమిలో అక్రమార్కులు ఎక్కువ లోతు పెట్టి మట్టిని తీస్తున్నారు.

**..సిఫార్సులతో వెనక్కి తగ్గుతున్న అధికారులు..**

**ఈ గ్రామంలో అక్రమ మైనింగ్ జోరు ఏమాత్రం తగ్గలేదు.**

అధికారుల అడ్డగింతలు, నేతల సిఫార్సులతో అక్రమార్కులకు మూడు పువ్వులు ఆరు కాయలు చందంగా తయారయింది. అక్రమ మట్టి దందా వ్యవహారం భారీగా జరుగుతుంది. ఈ అక్రమ మైనింగ్ ను అంటుకునేవారు, అడ్డు చెప్పేవారు లేకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాటగా పరిస్థితి మారింది. ఇంతభారీ అక్రమ మైనింగ్ జరుగుతున్నగాని రెవిన్యూ, పోలీస్, జల వనరులు, మైనింగ్, తదితర శాఖల అధికారులు మామూళ్ల మత్తులో ఉండి, కబోధి పక్షుల్లా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వోల్టా చట్ట ప్రకారం సంబంధిత శాఖల నుండి అనుమతులు తీసుకోకుండానే వాగులు, చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో మట్టిని బేస్మెంట్లకు, ఇతర అవసరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

## గింజుపల్లిలో జిల్లా అధికారుల ఆకస్మిక తనిఖీలు

**అనుమతులు లేని పడవ సీజ్.. నిర్వాహకులపై కేసు నమోదు**

**ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పడవలపై ఉక్కుపాదం**

అచ్చంపేట, జూన్ 29 (ప్రభాత వార్త): కృష్ణానదిపై అనుమతులు లేకుండా, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండా ప్రమాదకరంగా నడుస్తున్న పడవలపై జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.హెచ్. కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గింజుపల్లి వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.
తనిఖీల సందర్భంగా ఎలాంటి చెల్లుబాటు అయ్యే లైసెన్స్, ఫిట్నెస్ సర్టిఫికెట్ లేకుండానే ప్రయాణికులను తరలిస్తున్న ఒక పడవను అధికారులు గుర్తించారు. వెంటనే పడవను స్వాధీనం (సీజ్) చేసుకుని, పడవ నిర్వాహకులు, నడిపే వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.హెచ్. కృష్ణ మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రతతో చెలగాటం ఆడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ



ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు, చట్టబద్ధ అనుమతులు లేకుండా నడిచే పడవలు, ఫెర్రీలపై ఇకపై కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా నిరంతర తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో జిల్లా పరిషత్ ఏఓ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ శ్రీహరి తదితర అధికారులు పాల్గొన్నారు.

## చిన్న..సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధి చెందాలి....సహకార సంఘాలు బలోపేతం కావాలి

కొల్లిపర,జూన్ 29 ప్రభాతవార్త: చిన్న..సన్నకారు రైతులకు రుణాలు ఇచ్చి వారు ఆర్థికాభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పాటు...సహకార సంఘాలు కూడా బలోపేతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెనాలి డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి రామారావు అన్నారు.సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సహకార సంఘం వారోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.కొల్లిపర సొసైటీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సహకార సంఘాలు ఎరువులు,ధీర్ఘకాలిక



రుణాలు,స్వల్పకాలిక రుణాలు,ఇతర వ్యవసాయ రుణాలు వంటివి రూ.20 కోట్లు వరకు రైతులకు ఇచ్చి రైతుల ఎదుగుదలకు కృషి చేస్తున్నామన్నారు.ఆన్లైన్ ద్వారా సేవలన్నీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.కొల్లిపర సహకార సంఘం బ్రాంచి మేనేజర్ బాజీబాబా మాట్లాడుతూ కొల్లిపర బ్రాంచి నుండి ఇప్పటి వరకు రూ.102 కోట్లు వరకు రుణాలు ఇవ్వటం జరిగిందన్నారు.కార్యక్రమంలో తూములూరు సొసైటీ అధ్యక్షుడు చాగంటి రామిరెడ్డి,సొసైటీ డైరెక్టర్లు భీమవరపు కిషోర్రెడ్డి,గుదిబండి పద్మజ,సీఈవో గుదిబండి శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం బాగుంటుంది

కొల్లిపర,జూన్ 29 ప్రభాతవార్త: రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం బాగుంటుందని చెబుతూ రైతులు పండించిన పంటలకు కూడా మంచి ధరలు..దిగుబడులు వస్తేనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఆలయ వ్యవస్థాపక దర్మకర్త అచ్చుత ఇందుశేఖర్ అన్నారు.మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవినాయకస్వామి ఆలయం ఆవరణలో



సోమవారం ఏరువాక పున్నమి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.ఆలయ వ్యవస్థాపక దర్మకర్త అచ్చుత ఇందుశేఖర్ ఆధ్వర్యంలో పండితులు తొలుత శ్రీవినాయకస్వామికి ఈ ఏడాది పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలంటూ పూజలు చేసారు.అనంతరం ఇందుశేఖర్ దంపతులు రైతులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో గ్రామపెద్దలు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అవోపా ఆధ్వర్యములో "ఏరువాక పౌర్ణమి"

గుంటూరు విద్యా జూన్ 29 ప్రభాతవార్త: గుంటూరు స్థానిక పాత గుంటూరులోని "శ్రీ గంగా పార్వతీ సమేత అగస్తేశ్వర స్వామి వారి దేవాలయము" నందు ఏరువాక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అవోపా అధ్యక్షులు కే.వీ. బ్రహ్మం ఆధ్వర్యంలో సోమవారము నాడు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు విష్ణు సహస్రనామము, లలితా సహస్రనామము, లింగాష్టకము మరియు హనుమాన్ చాలీసా పారాయణము చేసినారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవాలయం చైర్మన్ సతీష్ బాబు పాల్గొన్నారు. చైర్మన్ సతీష్ బాబు మాట్లాడుతూ అవోపా సభ్యులందరూ మన సంస్కృతీ సాంప్రదాయాలను పెంపొందించడంలో ముందుంటారని, ఇటువంటి కార్యక్రమాలు భావితరాలను ఆధ్యాత్మికత వైపు నడిపించడానికి ఉపయోగపడతాయని, భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మహిళలు స్వామివారికి ప్రత్యేక అభిషేకములు చేసినారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, వడకట్టు సునీల్ మరియు ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# సుమేధ హైస్కూల్ కు జిల్లా స్థాయి "బెస్ట్ ఇంటరాక్ట్ క్లబ్" అవార్డు

గుంటూరు విద్య జూన్ 29 ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటెనియల్ ఆధ్వర్యంలో స్పాన్సర్ చేయబడిన సుమేధ హైస్కూల్ ఇంటరాక్ట్ క్లబ్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఆర్ఐ డిస్ట్రిక్ట్ 3150 ఇంట్రాక్ట్ డిస్టిక్ కాన్ఫరెన్స్ హైదరాబాద్ నందు జిల్లా వ్యాప్తంగా 27 ఇంటరాక్ట్ క్లబ్లు పాల్గొని 120 సేవా ప్రాజెక్టులను ప్రదర్శించాయి. ఈ ప్రాజెక్టులన్నింటిలో అత్యుత్తమ సేవా కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలు, సమాజానికి చేసిన విశిష్ట సేవలను



పరిగణనలోకి తీసుకొని సుమేధ హైస్కూల్ ఇంటరాక్ట్ క్లబ్కు బెస్ట్ ఎంట్రాక్ట్ క్లబ్ ఆఫ్ అమరావతి రీజియన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటెనియల్ అధ్యక్షులు డా. వీర రాఘవరావు ఆతుకూరి మాట్లాడుతూ, ఈ విజయం విద్యార్థుల సేవా దృక్పథానికి, పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహానికి, ఇంటరాక్ట్ క్లబ్ సభ్యుల అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన పాఠశాల యాజమాన్యం, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా, శంకర నేత్రాలయం, కాకాని వారి సహకారంతో రొటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటెనియల్ ఆధ్వర్యంలో సుమేధ హైస్కూల్, గుంటూరులో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 700 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 150 మంది విద్యార్థులకు తదుపరి వైద్య సంప్రదింపులు మరియు చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు అందించి, తదుపరి చికిత్సకు మార్గదర్శకత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన శంకర నేత్రాలయం, కాకాని వైద్య బృందానికి, సుమేధ హైస్కూల్ యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు మరియు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటెనియల్ సభ్యులందరికీ నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ రెండు కార్యక్రమాలు విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడమే కాకుండా, వారి ఆరోగ్య పరిరక్షణకు మరియు సమాజ సేవకు రోటరీ నిరంతరం కృషి చేస్తోందని మరోసారి నిరూపించాయి.

# రాజధాని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు

గుంటూరు విద్య జూన్ 29 ప్రభాతవార్త: అమరావతి రాజధాని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జంజనం కోటేశ్వరరావు విమర్శించారు. రాజధాని రైతుల కోసం చేస్తున్న రిలే నిరసన దీక్ష 365వ రోజుకు చేరిన సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని ప్రాంత భూముల రెండో పూల్లింగ్ పై రాష్ట్ర ప్రభుత్వం నుండి రైతులకు స్పష్టమైన హామీ ఇప్పటివరకు రాలేదని, కూటమి ప్రభుత్వం ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ దాడులు, అరాచకాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని, ఇది ఎంతకాలం కొనసాగదని, కూటమి లో నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలిగి, వైయస్సార్సీపీ పార్టీ కూటమిలోకి వచ్చే సమయం ఆసన్నమైందని,



అదే జరిగితే తెలుగుదేశం పార్టీ ఊసే రాష్ట్రంలో ఉండదని జోష్యం చెప్పారు. దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు తగదని, అధికారంలో ఉన్నాం కదా అని మనం చేస్తే అధికారం కోల్పోయిన తర్వాత అదే తరహాలో దాడులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలుగుదేశం పార్టీని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజల కొరకు పనిచేయడం లేదని లక్షల కోట్లు దండుకోవడానికి పని చేస్తుందని విమర్శించారు. అమరావతి ఒక కులం రాజధాని కాదు 5 కోట్ల ప్రజల కలల రాజధాని అన్నారు. వివిధ రాష్ట్రాలలో అన్ని రాజకీయ పార్టీలు ఒక తాటిపై వచ్చి ప్రజా పాలనలో పాలి భాగస్తులు అవుతుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏం దౌర్భాగ్యం వచ్చిందని దొంగ రాజకీయాలు చేస్తున్నారంటూ తెలుగుదేశం పై మండి పడ్డారు. రాజధాని ఎవడి అబ్బ సొత్తు కాదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్ఆర్ఐ ల నుండి నిధులు తెచ్చి సగం ఖర్చు చేసి సగం జేబులోకి వేసుకొని ఎంజాయ్ చేస్తున్నారే తప్ప రైతులకు తెలుగుదేశం పార్టీ ఏమి చేసిందని ప్రశ్నించారు. రాష్ట్ర రాజకీయాలు మొత్తం నాకు తెలుసని ఎప్పుడు ఏం చేయాలో ఎవరిని కలవాలో తెలుసన్నారు. ఎస్సీ, ఎస్టి, బీసీలను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎలా చేయాలో అవగాహన ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిస్థితులను నిత్యం గమనిస్తూనే ఉన్నానన్నారు. ఏ ఆర్ ఎస్ పార్టీ నిప్పులాంటి రాజకీయం చేస్తుందని ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. భారతీయ జనతా పార్టీ సింగిల్ గా రాష్ట్రంలో మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే తప్ప ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ కుల రాజకీయాలు అంత మవ్వవని స్పష్టం చేశారు.

# ప్రాంగణ నియామకాల్లో ఆర్.వి.ఆర్ , జె.సి. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు విద్య జూన్ 29 ప్రభాతవార్త : ప్రముఖ ఐటీ సంస్థలు ఇటీవల తమ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ నియామకాల్లో 21 మంది విద్యార్థులకు రూ. 3 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ప్యాకేజీలతో ఉద్యోగ అవకాశాలు లభించడం ఆనందదాయకమని, 2025-26 విద్యా సంవత్సరంలో పలు క్యాంపస్ డ్రైవ్ల ద్వారా ఇప్పటికి 1,118 నియామకాలు జరగడం కళాశాలకే గర్వకారణమని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సోమవారం నాడు కళాశాల సిబ్బంది అభినందించారు. తమ కళాశాలలోని ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా ఆధునిక సాంకేతిక విద్యా బోధనతో పాటూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించడం ద్వారానే కంప్యూటర్ ఇంజనీరింగ్ కోర్స్ విద్యార్థులతో పాటు సమానంగా కోర్ బ్రాంచ్ల విద్యార్థులకు కూడా ప్రముఖ కంపెనీలలో ఆకర్షణీయమైన ప్యాకేజీలతో ఉద్యోగాలు లభిస్తున్నాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నియామకాలలో ఆర్షిత్ ఫ్రెష్ కంపెనీలో 5 గురు విద్యార్థులకు రూ.6 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపిక కాగా, ఎసెంచ్యూర్ కంపెనీలో ఇద్దరు విద్యార్థులు రూ.4.5 లక్షల ప్యాకేజీతో, ఇంక్యూజ్ ఏ ఐ కంపెనీలో 8 మంది విద్యార్థులు రూ.4 లక్షల ప్యాకేజీతో, మిరాకిల్ సాఫ్ట్ వేర్ సిస్టమ్స్ లో ఒక విద్యార్థికి



రూ.3.75 లక్షల ప్యాకేజీతో, షాగరోన్ కంపెనీలో ఒక విద్యార్థికి రూ.3.6 లక్షల ప్యాకేజీతో, వర్క్బ బోట్ కంపెనీలో నలుగురు విద్యార్థులకు రూ.3 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారని, ఈ విద్యా సంవత్సరంలో సుమారు 80 శాతం మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల ద్వారా సగటు వేతనం రూ. 5.5 లక్షలు, అత్యధిక వేతనం రూ. 21 లక్షలతో ఉద్యోగాలు పొందగా, మిగిలిన వారు విదేశాలలోని ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు అర్హత సాధించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ అధికారులు శ్రీ సి.హెచ్. శ్రీనివాసరావు, డా.కె. సురేష్ బాబు, వివిధ శాఖల విభాగాధిపతులు, ప్లేస్మెంట్ ఇన్చార్జ్లు విద్యార్థులను అభినందించారు.

# హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష

తెనాలి జూన్29(ప్రభాతవార్త): రేపల్లె మండలం పేటేరు గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తిని హత్య చేసిన కేసులో, అప్పటి రేపల్లె సీఐ ఏ. మల్లిఖార్జునరావు చేసిన దర్యాప్తులో, ముద్దాయిలుగా ఉన్న గున్నం వెంకటేశ్వర్లు(19), గున్నం వరదయ్య (45)లపై నేరం నిరూపణ కావడంతో ఇద్దరు ముద్దాయిలకు తెనాలి 11వ అదనపు జిల్లా జడ్జి ఇరువురికి యావజ్జీవ కారాగార శిక్ష మరియు ఒక్కొక్కరికి 2000 రూపాయలు అపరాధం విధించారు అపరాధ కట్టని యెడల ఒక్కొక్కరికి రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున తెనాలి 11వ జిల్లా అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంవి. సాంబశివరావు వాదనలు వినిపించారు. కోర్టు కానిస్టేబుల్ నక్కా నాగమల్లేశ్వరరావు ప్రాసిక్యూషన్ కొరకు సాక్షులను ప్రవేశపెట్టారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన తెదేపా నేతలు:

తెనాలి మున్సిపాలిటీ జూన్29(ప్రభాతవార్త): మానవత్వమే ధ్యేయంగా, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించిన తెలుగుదేశం పార్టీ నేతలు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండలం, తూములూరు గ్రామానికి చెందిన కోనా సీతారావమ్మ వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి ,ప్రస్తుత ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ



మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి లెటర్ అఫ్ క్రెడిట్ నుంచి రూ. 2,01,852/ మంజూరైంది. ఈ ఆర్థిక సహాయానికి సంబందించి సోమవారం, బాధిత కుటుంబానికి 2,01,852/ ల చెక్కును అందజేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు. ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి, బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, మల్లవరపు విజయ్, ఫణిదపు దుర్గ, రామకృష్ణ, షావుల్, కన్నయ్య, ఉలిసి పూర్ణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ని సమాజం నుండి తరిమెయ్యాలి:

తెనాలి జూన్29(ప్రభాతవార్త): ఆంధ్ర ప్రభ ఇంటర్నేషనల్ డే అగైనెస్ట్ డ్రగ్ అబ్యూస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం గుంటూరు ఆధ్వర్యంలో స్థానిక ఏ.ఎస్.ఎన్.డిగ్రీ కాలేజ్ లోసోమవారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేక సదస్సు నిర్వహించారు. యువతకు డ్రగ్స్ వల్ల వచ్చే మానసిక సమస్యలు, దుష్ప్రభావాలు, మరియు వాటి నుండి బయటపడడానికి కావలసిన దిశానిర్దేశం చేసారు. సమాజంలో ఈ అవగాహన కార్యక్రమం ద్వారా, యువత, వారి కుటుంబాలు, స్నేహితులు కలిసి డ్రగ్స్ ముప్పు నుంచి బయటపడేందుకు, ఆరోగ్యకరమైన మార్గాన్ని ఎంచుకోవడానికి ప్రోత్సహించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా, కుటుంబాలు, మిత్రులు, సమాజం మొత్తం కలిసి డ్రగ్స్ వ్యతిరేకంగా నిల్చొని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అవలంబించేందుకు కృషి చెయ్యాని అలాగే సమాజం పట్ల బాధ్యతతో ఉండాలి అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే.రాంచంద్ , జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ చింతా మోనిక, క్లినికల్ సైకాలజిస్ట్ కన్నా బాల సాయికుమార్, సైకియాట్రి స్టాఫ్ నర్స్ శ్రావణి పాల్గొన్నారు.

## జేష్ఠ పౌర్ణమి మూలానక్షత్రం సందర్భంగా శ్రీరామలింగేశ్వర స్వామికి విశేషపూజలు:

తెనాలి జూన్29(ప్రభాతవార్త): స్థానిక రామలింగేశ్వర పేటలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం జేష్ఠ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. జేష్ఠ పౌర్ణమి మూలా నక్షత్రం సందర్భంగా విద్యార్థులకు పుస్తకము, పెన్ను లను పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి హరి ప్రసాద్ మాట్లాడుతూ,పౌర్ణమి మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కొండూరు శృంగేరి ,జ్యోతి దంపతుల సహకారంతో విద్యార్థులకు పుస్తకములను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది గౌరీ శంకర్, అర్చకులు వి. రాఘవేంద్ర వరప్రసాద్ ,భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ కొని వృద్దుడు మృతి

తెనాలి జూన్29(ప్రభాతవార్త): రైల్వే ప్లై ఓవర్ అండర్ బ్రిడ్జి కింద నిర్దిష్ట నిద్రిస్తున్న గుర్తు తెలియని వృద్ధుని కారు ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన పట్టణంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం తెల్లవారుఝామున జరిగింది. పోలీసుల కథనం ప్రకారం, మారీసు పేటలోని రైల్వే ప్లై ఓవర్ అండర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డు ప్రక్కన నిద్రిస్తున్న వృద్ధుడిని గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి సుమారు 60 నుండి 65 సంవత్సరాల వయసు కలిగి ఉన్నాడని అతని యొక్క వివరాలు తెలిసినవారు తెనాలి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ నందు సమాచారం అందించాల్సిందిగా త్రీ టౌన్ సీఐ ఎస్.సాంబశివరావు ఫోన్ నెంబర్ 9440796274,మరియు ఎస్సై ఫోన్ నెంబర్ 9491314341 నెంబర్లకు తెలియపరచవలసిందిగా పేర్కొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహనికి అంత్యక్రియలు

తెనాలి జూన్29(ప్రభాతవార్త): రైలు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి అంత్యక్రియలు నిర్వహించిన శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం జూన్ 25వ తేదీ గురువారం ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి మృతి చెందిన వ్యక్తి(సుమారు 45సం++)యొక్క భౌతికకాయాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలయం మార్చురీ నందు భద్రపరిచారు. అయితే మృతునికి సంబంధించి ఎవ్వరూ రాకపోవటం, రైల్వే పోలీసులకు ఎటువంటి సమాచారం లభించకపోవడంతో, గుర్తు తెలియని మృతదేహం గా భావించి, తెనాలి పట్టణంలో ప్రముఖ సేవా సంస్థ శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవాసమితి అధ్యక్షులు కుర్రా శ్రీను కు సమాచారం అందించగా, అతను తమ సొంత వాహనంలో సేవాసమితి సభ్యుల సహకారంతో బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో గుర్తుతెలియని మృతదేహానికి సాంప్రదాయ బద్దంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోతురాజు, అబ్రహం, సంజయ్, సేవాసమితి సభ్యులు

# మున్సిపల్ కార్యాలయంలో ఓటర్ జాబితా హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తెనాలి మున్సిపాలిటీ జూన్29(ప్రభాతవార్త): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్ 2026)ప్రక్రియలో భాగంగా తెనాలి నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశారు. తెనాలి, కొల్లిపర మండలాలతో పాటు, తెనాలి మున్సిపాలిటీ కార్యాలయంలో కూడా వీటిని ఏర్పాటు చేశారు. పురపాలకసంఘు పరిధిలోని ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయం గం.10 నుండి సాయంత్రం గం.5 వరకు, జులై 14వ తేదీ వరకు ఈ హెల్ప్ డెస్క్ ద్వారా ఓటర్లు సేవలు పొందవచ్చని, అంతే కాకుండా ఎన్యూమరేషన్ ఫారాలు, వెరిఫికేషన్ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం టూల్ ఫ్రీ నెంబర్ 1950 హెల్ప్ లైన్ ను సంప్రదించాలని అధికారులు సూచించారు

# మున్సిపల్ గ్రీవెన్స్ కి 3అర్జీలు

తెనాలి మున్సిపాలిటీ జూన్29(ప్రభాతవార్త): ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా పంపించారు. ప్రధానంగా ఇంజనీరింగ్ సెక్షన్ కు సంబంధించి, నేతి సీతారామరాజు ఇచ్చిన అర్జీ మునిసిపాలిటీకి చెందిన కాంప్లెక్స్ ఉన్న పేరు మాధవ పెద్ది



వెంకట్రామయ్య పేరు బోర్డు కొత్తగా ఏర్పాటు చేయుటకు వినతి పత్రం అందించారు. అలాగే పురపాలక సంఘ పరిధిలోని 29,30,31,32 వార్డులో అమరావతి కాలనీవాసులు, అమరావతి ఫ్లాట్స్ (ఉడా కాలనీ) మధ్యలో నుండి రైల్వే గూడ్స్ షెడ్డుకు భారీ వావనముల రాకపోకల గురించి వచ్చిన అర్జీ, అదేవిధంగా రెవెన్యూ సెక్షన్ కు సంబంధించి,1028026339 ఇంటి పన్ను ఆన్ లైన్ లో చెల్లించామని దానికి రశీదు ఇప్పించవలసినది అర్జీ ద్వారా తెలియేజేసినారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

# నల్లపాడు జడ్పీ హైస్కూలు ను సందర్శించిన డి ఇ ఓ

గుంటూరు విద్య జూన్ 29 ప్రభాతవార్త : గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష గుంటూరు రూరల్ మండలంలోని నల్లపాడు లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, నోటు పుస్తకాలను తనిఖీ చేశారు . ఈ సందర్భంగా డిఇఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుండి ఏ రోజు వర్క్ ను ఆరోజు పూర్తి చేసుకోవాలని, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించే విధంగాను, ఉత్తమ ర్యాంకులు సాధించే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ విద్యా సంవత్సరంలో చేయవలసిన కార్యక్రమాలను వివరించారు. త్వరలో జరిగే మెగా పేరెంట్స్ సమావేశమునకు ఏర్పాటు చేసుకోవాలని, తల్లికి వందనం అర్హుల జాబితాను సిద్ధం చేసుకోవాలని సలీం భాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జైపూర్ లో జులై 4, 5 తేదీలలో ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ మహా సమావేశాలు

గుంటూరు విద్య జూన్ 29 ప్రభాతవార్త: అల్ ఇండియా బ్రాహ్మిణ్ ఫెడరేషన్ జాతీయ సమావేశాలు జైపూర్ లో జులై 4,5 తేదీలలో జాతీయ అధ్యక్షుడు ఎస్ డి శర్మ (జైపూర్) అధ్యక్షతన జరుగుతాయని ఏ ఐ బి ఎఫ్ జాతీయ సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవి కుమార్ మీడియా సమావేశంలో తెలిపారు. ..ఈ సమావేసానికి 26 రాష్ట్రాలు,7 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి ప్రతినిధులు 300 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు . ఈ సమావేశంలో ..బ్రాహ్మణ సామాజిక వర్గానికి జాతీయ స్థాయి లో అవసరమైన 14 ముఖ్యమైన తీర్మానాలను ప్రవేశపెడుతున్నామని చెప్పారు.. ..25,000 వేల కోట్లతో భారత బ్రాహ్మిణ్ వెల్ఫేర్ కార్పొరేషన్



ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు.. ఫెడరేషన్ చీఫ్ అడ్వైజర్ పెద్దిభొట్ల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రాబోయే టీటీడీ పాలక మండలిలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని , ఆంధ్రప్రదేశ్ కు చెందిన బ్రాహ్మణులకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ని మీడియా ద్వారా కోరారు. అరండల్ పేట 15 వ లైను లోని కుబేరా టవర్స్ లో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశం లో జాతీయ సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవి కుమార్ మాట్లాడుతూ ఆల్ ఇండియా బ్రాహ్మణ్ ఫెడరేషన్ 1984 సంవత్సరంలో విశాఖపట్నం లో ఏర్పడిందని, దేశంలోని బ్రాహ్మణ జాతికి అండగా, సామాజిక రాజకీయ ఆర్థిక అభివృద్ధికి కృషి చేయుటకు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు జాతీయ కోశాధికారి పదవి 44 సంవత్సరాల కాలంలో మొదటి సారి గుంటూరు కు చెందిన తిప్పావజ్జుల నారాయణ శర్మ కు అవకాశం కల్పించిన జాతీయ అధ్యక్షుడు ఎస్ డి శర్మ కి, చీఫ్ అడ్వైజర్ పెద్దిభొట్ల లక్ష్మీ నారాయణ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కోశాధికారి టి ఎన్ శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణ సామాజిక వర్గం ఎన్నో రాష్ట్రాలలో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని, కేంద్ర ప్రభుత్వం బ్రాహ్మణ కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి, దేశంలో బ్రాహ్మణ సంక్షేమానికి నడుంబిగించాలని డిమాండ్ చేశారు. జాతీయ కార్యదర్శి వెలవర్తిపాటి పాండురంగ విఠల్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బ్రాహ్మణులను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నాయని, బ్రాహ్మణ సామాజిక వర్గానికి రాజకీయ పదవులలో వివక్ష చూపుతున్నారని, వివక్షను విడనాడాలని, అందుకు నిదర్శనం గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దురదృష్టకరమని, దీనిపై బ్రాహ్మణులు ఆలోచించాలని పాండురంగ విఠల్ కోరారు.

# తెనాలి ఆటోనగర్,దొంగతనం కేసులో ఇరువురికి జైలు

తెనాలి మున్సిపాలిటీ జూన్29(ప్రభాతవార్త): తెనాలి పట్టణంలో బాలాజీ రావు పేటకు చెందిన మాలెపాటి వేణు మాధవరావు ఆటోనగర్లో గత 20 సంవత్సరాలుగా శ్రీ పార్థసారథి మెటల్ ఇండస్ట్రీస్ నడుపుతున్నాడు. షాపులో గుమస్తాగా షేక్ యూసఫ్ పనిచేస్తూ ఎప్పటిలాగే ది. జనవరి 11వ తేదీ 2026 న రోజులాగే రాత్రి షాపు మూసి వేసి మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు షాపు వద్దకు వచ్చి చూడగా షాప్ తాళాలు పగలగొట్టబడి ఉండి షాపులోపల బీరువాలో ఉన్న 35 వేల రూపాయలు గుర్తుతెలియని దొంగలు దొంగతనం చేసినారు. ఈ విషయాన్ని షాప్ గుమస్తా యజమాని సలహా మేరకు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో రిపోర్టు ఇచ్చినాడు. కేసును తెనాలి రూరల్ ఎస్సై కట్టా ఆనంద్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి 2026 జనవరి 14వ తేదీన గుంటూరు శారద కాలనీ చెందిన మిక్కిలి సందీప్ మరియు పటాన్ మస్తాన్వలి లను అరెస్టు చేసి వారి వద్ద నుండి ఈ కేసులో చోరీ అయినా డబ్బులు 15000 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక ఇద్దరు ముద్దాయిలు చెంచుపేటలోని వైన్ షాప్లో దొంగతనం, మారీస్పేటలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో దొంగతనానికి యత్నం, తాడికొండ మరియు అమరావతి ప్రాంతాల్లో జరిగిన ఇంటి చోరీలు, అలాగే అమరావతిలోని విక్రమ్ ప్లైవుడ్ హార్డ్ వేర్ షాపులో జరిగిన నగదు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకుని వారి వద్ద నుండి చోరి సొత్తుని కూడా స్వాధీనం చేసుకున్నారు. తదుపరి ముద్దాయిలను కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసు విచారణలో భాగంగా సోమవారం ముద్దాయిలపై నేరం నిరూపణ అయినందున తెనాలి రెండవ అదనపు సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) గ్రంధి శ్రీనివాస్ ముద్దాయిలిద్దరికీ ఆరు నెలలు చొప్పున జైలు శిక్ష విధించారు మరియు చెరి వెయ్యి రూపాయలు జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్ కుమార్ వాదించినారు. కోర్టు హెడ్ కానిస్టేబుల్ వాసా శ్రీనివాసరావు సహకారం అందించినారు.

# కనుల పండుగగా హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు

తెనాలి జూన్29(ప్రభాతవార్త): హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం తెనాలి పట్టణంలో హిందూ సామ్రాజ్య దినోత్సవ వేడుకలు కన్నుల పండుగగా నిర్వహించారు. పట్టణంలోని సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణము నుండి హిందూ సామ్రాజ్య దినోత్సవ ర్యాలీ ప్రదర్శనగా మెయిన్ రోడ్డు గాంధీ చౌక్ మీదుగా శివాజీ చౌక్ ప్రాంతానికి చేరుకుంది. ఈ ప్రదర్శనలో తెనాలి పట్టణం మరియు పరిసర గ్రామాల నుండి పెద్ద ఎత్తున వేలాదిగా హిందూ సోదరులు పాల్గొని చత్రపతి శివాజీ మహారాజ్ కు జై జైలు పలుకుతూ ర్యాలీగా ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేక వాహనంపై చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఉంచి ప్రదర్శనగా పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకర్షించాయి. ఈ వేడుకలకు ముఖ్య



అతిథిగా భారత చైతన్య యోజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ హాజరయ్యారు. విశిష్ట అతిథిగా భారతీయ జనతా పార్టీ ఆంధ్ర ప్రదేశ్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు తనతల సురేష్ అలాగే ప్రధాన వక్తగా తెలంగాణ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి, ధర్మరక్ష ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, చికోటి ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ, ప్రపంచ దేశాల్లో అత్యధికంగా హిందువులు ఉన్న దేశం భారతదేశం అని కావున హిందువులందరూ ఏకమవాల్సిన అవసరం ఉందని హిందువుల ఐక్యతే వారి బలమని నేడు హిందువుల్లో ఐక్యత లోపించటం వలన మిగతా మతాల వారికి తేలిక భావంలో కనబడుతున్నామని ధర్మ పరిరక్షణకు హిందువుల ను ఏకతాటిపై తీసుకురావాల్సిన అవసరం నేటి యువతకి ఉందన్నారు. తెలంగాణ బిజెపి పార్టీ అధికార ప్రతినిధి తన తల సురేష్ మాట్లాడుతూ, భారతదేశంలో హిందువులను అణగదొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయని వాటిని తిప్పి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని హిందువులందరూ తమ కులాలను పక్కనపెట్టి సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. హిందువులను వెడగొట్టటానికి అసాంఘిక శక్తులు ప్రయత్నాలు చేస్తున్నారని ఈ విషయం హిందువులందరూ గమనించాలన్నారు. భారతదేశంలో చత్రపతి శివాజీ మహారాజ్ హిందూ పరిరక్షణకు హిందూ మత వ్యాప్తికి ఎంతో విశేషమైన కృషి చేశారని కావున ఆయన పట్టాభిషేక మహోత్సవం జరిపిన రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవం గా జరుపుకుంటున్నామని ఈ సందర్భంగా ఇంత పెద్ద ఎత్తున హిందూ సోదరులను ఏకం చేసి నిర్వహించిన హిందూ చైతన్య వేదిక సభ్యులను అభినందిస్తున్నానన్నారు అదేవిధంగా హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం కొనసాగించాలని చత్రపతి శివాజీ మహారాజ్ ఆశయాలను ఆలోచన నేటి తరానికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణం మరియు పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున హిందూ సోదరులు సోదరీమణులు అభిమానులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

## మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నదే మంత్రి నారా లోకేష్ లక్ష్యం...

మంగళగిరి, జూన్ 29, ప్రభాతవార్త : మంగళగిరి నియోజకవర్గంలో స్కిల్స్ శక్తి కార్యక్రమంలో భాగంగా మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం 81వ బ్యాచ్ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా మంగళగిరి టౌన్‌కు చెందిన 70 మంది మహిళలకు 60 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ అందించగా, శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సోమవారం మంగళగిరి నియోజకవర్గ టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో సర్టిఫికెట్లు, ఉచిత కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి నియోజకవర్గ తెలుగు మహిళ



అధ్యక్షురాలు, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ఈ కార్యక్రమాన్ని తన సొంత నిధులతో నిరంతరంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే వేలాది మంది మహిళలు ఈ శిక్షణ ద్వారా ఉపాధి పొందుతూ తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళల అభ్యున్నతికి మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, వారి జీవితాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపే కార్యక్రమాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించి మరింత మందికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## భాజపా కార్యాలయంలో జనతా వారిధి కార్యక్రమం

మంగళగిరి, జూన్ 29, ప్రభాతవార్త: మంగళగిరి భారతీయ జనతా పార్టీ కార్యాలయం లో పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వర రావు ఆధ్వర్యంలో జనతా వారధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులు బిట్రా శివన్నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి జనతా వారధి కార్యక్రమంలో ప్రజల సమస్యలు అధికారుల వద్ద నుంచి పరిష్కారం పొందేందుకు భారతీయ



జనతా పార్టీ వారధి లాగా పని చేస్తుందని ప్రజలందరూ జనతా వారధి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మంగళగిరి షరాబజార్ లోని రామాలయం వద్ద నీటి లీకేజీ జరుగుతుందని ఒక అర్జీ రాగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఎంటీ ఎంసీ అడిషనల్ కమిషనర్ కే వెంకటేశ్వరరావుకు అర్జీ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు మునగాల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పంచుమర్తి ప్రసాద్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు బుల్ల రాజారావు, సీనియర్ నాయకులు మైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## గ్రామదేవతకు శ్రీలలిత సహస్రనామ పూజ

పెదకూరపాడు, జూన్ 29, ప్రభాతవార్త: మండలంలోని 75త్యాళ్ళూరులో గ్రామదేవత శ్రీదేమ్మ తల్లి సన్నిధిలో శ్రీలలిత సహస్రనామ పారాయణం,పూజ ఘనంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి, జ్యేష్ఠ పూర్ణిమను పురస్కరించుకుని శ్రీలలిత కమిటీ మహిళా భక్తబృందం వారు శ్రీలలిత సహస్రనామ



,శ్రీలలితా అష్టకం,మణిద్వీప వర్ణన పారాయణ చేశారు.ముందుగా అమ్మవారికి పసుపు కుంకుమలు,పొంగలి ప్రసాదం సమర్పించారు.పారాయణ అనంతరం మహానివేదన,హారతి ఇచ్చి ,తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## సాహిత్య, ఆధ్యాత్మిక సేవలకు గుర్తింపుగా డాక్టర్ శ్యామలరావుకు సాహిత్య సేవారత్న అవార్డు

మంగళగిరి, జూన్ 29, ప్రభాతవార్త: సాహిత్య, ఆధ్యాత్మిక, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలందించిన మంగళగిరి పట్టణానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, సీకే జూనియర్ కళాశాల మాజీ ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ కొసనం కోట నాగ శ్యామలరావుకు ప్రతిష్ఠాత్మక సాహిత్య సేవారత్న అవార్డు లభించింది. ఈ విషయాన్ని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.సాహిత్య సేవ అవార్డు కౌన్సిల్, వరల్డ్ కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు..ఆదివారం న్యూఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు.శ్యామలరావు సీకే జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్




లెక్చరర్‌గా సేవలందిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు కళాశాల మ్యాగజైన్ కమిటీ సభ్యుడిగా కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం తెలుగు, ఆంగ్ల భాషల్లో విద్యా, సాహిత్య అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు కృషి చేసినట్లు తెలిపారు.అలాగే 2008 సంవత్సరం నుంచి బ్రహ్మర్షి పత్రీజీ వద్ద ధ్యాన విద్యను అభ్యసించిన ఆయన, అనంతరం ధ్యాన విద్యను ఉచితంగా విద్యార్థులకు బోధిస్తూ వస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా యువతకు, విద్యార్థులకు ధ్యానం, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పిస్తూ సేవలందిస్తున్నారు.సాహిత్య రచనలు, ఆధ్యాత్మిక ప్రచారం, సమాజ సేవ వంటి రంగాల్లో నిరంతరంగా చేసిన కృషికి గుర్తింపుగానే ఈ సాహిత్య సేవారత్న అవార్డును అందజేసినట్లు శ్యామలరావు తెలిపారు.ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా సాహిత్య, విద్యా, ఆధ్యాత్మిక సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.

## సర్ లో మెప్మా ఆర్పీల సేవలను వినియోగించుకోవాలి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 29,ప్రభాతవార్త :కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో మెప్మా ఆర్పీల సేవలను వినియోగించుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే,, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక తూర్పు కార్యాలయంలో మెప్మా సీఓలు,



సీఎంఎంలతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సర్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో బూత్ లెవెల్ అధికారులకు కొందరు ఓటర్లను గుర్తించడం కష్టతరంగా మారుతుందని చెప్పారు ఈ క్రమంలో ప్రతి ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న మెప్మా ఆర్పీల సేవలను సర్ ప్రక్రియలో వినియోగించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఇప్పటికే బీఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందించారని, వాటిని తిరిగి తీసుకోవాల్సి ఉందని చెప్పారు. ఈ క్రమంలో బూత్ లెవెల్ అధికారులు మిగిలిన ఫారాలను పంపిణీ చేస్తుంటే ఆర్పీలు పూర్తి చేసిన పారాలలో తీసుకోవడానికి వీలుంటుందని అన్నారు. కొన్ని ప్రాంతాలలో ఓటర్లు వివిధ పనులు కోసం వేరే ప్రాంతాలకు వెళ్లి ఉండవచ్చని, వారి వివరాలను ఆర్పీల దగ్గర ఉంటాయని చెప్పారు. ఈ క్రమంలో సర్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఆర్పీల అవసరం ఉందని సూచించారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.20 వేల వైద్య సాయం

మంగళగిరి, జూన్ 29, ప్రభాతవార్త రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో అనారోగ్యంతో బాధపడుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కొమ్మారెడ్డి కిరణ్ (నాని) రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు. తాడేపల్లి మండలం చిర్రావూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కూరపాటి ఏసుబాబు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కొమ్మారెడ్డి కిరణ్ (నాని) వారి నివాసానికి వెళ్లి



పరామర్శించారు. ఏసుబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20,000 ఆర్థిక సహాయం అందజేస్తూ, భవిష్యత్తులో కూడా అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాసరి కృష్ణ, చిర్రావూరు గ్రామ టీడీపీ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసరావు, తాడేపల్లి మండల టీడీపీ ఉపాధ్యక్షులు గుండిమేడ రమేష్‌బాబు, ఇప్పటం సొసైటీ అధ్యక్షులు పోకల పాపయ్య, చిర్రావూరు గ్రామ మహిళా అధ్యక్షురాలు కంభం అనూష, గుండిమేడ గ్రామ టీడీపీ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు, మక్కపాటి ఏసుప్రసాద్, వీరిశెట్టి బాజీ, దావులూరి అనిల్, మొక్కపాటి వెంకట కృష్ణారావు, కొంక మునలయ్య, జెట్టి రవి, మానేపల్లి సురేష్, నల్లిబోయిన ప్రవీణ్, వీరిశెట్టి వెంకటేశ్వరరావు, పిల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ ద్వారా రైతులకు సహకారం. చైర్ పర్సన్ బత్తిని వేణు. పెదనందిపాడు ప్రారంభమైన సహకార వారోత్సవాలు.

పెదనందిపాడు జూన్ 29 (ప్రభాతవార్త)ప్రభుత్వం పీఏసీఎస్ ల ద్వారా రైతులకు మరింత సహకారం అందిస్తుందని పెదనందిపాడు పీఏసీఎస్ చైర్ పర్సన్ బత్తిని వేణుగోపాలకృష్ణ(వేణు) అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం కేంద్ర ప్రభుత్వం సహకార మంత్రిత్వశాఖ



విభాగం ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సహకార వారోత్సవాలు నిర్వహించారు. దీనిలో భాగంగా మొదటి రోజు సహకార రచ్చబండ మరియు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ బత్తిని వేణు మాట్లాడుతూ సహకార రంగాన్ని బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత రెండేళ్ల కూటమి పాలనలో సహకార సొసైటీ ద్వారా రైతులకు ఎన్నో రు.2.50కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. రుణాలు పొందిన రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృదికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జ్,అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి వాసుబాబు, మండల అసిస్టెంట్ ఇంచార్జ్, సీనియర్ ఇన్స్పెక్టర్ కె శ్రీనివాసరావు, జీడీసీసీబీ కాకుమాను బ్రాంచ్ మేనేజర్ జి నాగేంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్/సూపర్వైజర్ కె చక్రవర్తి, సీఈవో కె భాస్కరరావు, సొసైటీ సిబ్బంది మహేంద్ర. ఝాన్సీ. శ్రీదేవి. పలువురు రైతులు పాల్గొన్నారు.

## కిట్స్ లో ప్రారంభమైన అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం..

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూన్ 29, ప్రభాతవార్త : మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ..కాకినాడ జేఎన్టీయూకే సహకారంతో కిట్స్ కళాశాల సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఈ రోజు నుంచి ఐదు రోజుల అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 145 మంది అధ్యాపకులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా వరంగల్ ఎన్ఐటి కి చెందిన ప్రొఫెసర్ జె.రవికుమార్, అలాగే జేఎన్టీయూకే కాకినాడ నుండి డాక్టర్,ఎం.హెచ్.ఎం.కృష్ణ ప్రసాద్ ప్రొఫెసర్, డైరెక్టర్, అకడమిక్ కరికులం డెవలప్మెంట్ మరియు రీసెర్చ్ స్కాలర్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, కాకినాడ జవహర్లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారని చెప్పారు. ప్రొఫెసర్ జె.రవి కుమార్ మాట్లాడుతూ..ఆధునిక ఏఐ టెక్నాలజీతో శివివి




ఆర్ఎన్ఎన్, ఎల్ఎస్టిఎం మరియు సిఎన్ఎన్ అనే డీప్ లెర్నింగ్ అంశాలను పరిచయం చేశారు. ఈ సెషన్లో వీటి ప్రాథమిక భావనలు, పనిచేసే విధానం, వాటి మధ్య ఉన్న తేడాలు మరియు వివిధ రంగాల్లో వాటి ఉపయోగాల గురించి వివరించారు.ఆర్ఎన్ఎన్ సీక్వెన్షియల్ డేటా కోసం ఎల్ఎస్టియం దీర్ఘకాలిక సమాచారాన్ని గుర్తుంచుకోవడానికి, మరియు సిఎన్ఎన్ చిత్రాల ప్రాసెసింగ్ మరియు వర్గీకరణ కోసం ఎలా ఉపయోగిస్తారో వివరించారు. ఎలా చేయాలో వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఏఐ రంగంలో తాజా పరిశోధనలు, ఆవిష్కరణలు, విభిన్న రంగాలలో అనువర్తనాలపై శిక్షణ ఇచ్చారు. కాకినాడ జేఎన్టీయూకే చెందిన డా.ఎం.హెచ్.ఎం.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ..ప్రస్తుత ఏఐ రంగం అన్ని కోణాలలో విస్తరించడం జరిగిందని, ఈ రంగంలో ప్రస్తుత పరిశోధనా వ్యవస్థలో మార్పులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సెషన్లో అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వినియోగంపై విలువైన జ్ఞానాన్ని పొందారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన డా.ఆకుల సునీత ప్రాక్టికల్ హ్యాండ్స్ ఆన్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పైథాన్ ప్రోగ్రామింగ్ యొక్క ప్రాథమిక అంశాలను వివరించడంతో పాటు, మెషిన్ లెర్నింగ్ నమూనాల అమలు విధానాన్ని ప్రదర్శించారు. పాల్గొన్న వారు ప్రత్యక్షంగా కోడింగ్ మరియు అమలు ప్రక్రియలో పాల్గొని విలువైన అనుభవాన్ని పొందారు. కార్యదర్శి కోయి శేఖర్ మాట్లాడుతూ..అధ్యాపకులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని విద్యారంగ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డా.పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్, ఎఫ్.డి.పి కోఆర్డినేటర్ డాక్టర్.ఎం.హెచ్.ఎం. కృష్ణ ప్రసాద్ జేఎన్టీయూకే, కిట్స్ కోఆర్డినేటర్లు డా.ఆకుల సునీత, నిజాంపట్నం హరికృష్ణ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## జన గణన చేసి ఓబీసీల వాటా తేల్చకుంటే "జన్ జీ"ఉద్యమమే : శంకరరావు

తాడేపల్లి, జూన్ 29, ప్రభాతవార్త

జన గణనలో సమగ్ర కుల గణన చేసి, అన్నింటా ఓబీసీల వాటా తేల్చకుంటే " జెన్ జీ "ఉద్యమ తరహాలో లక్షలాది మందితో ఢిల్లీలో ఓబీసీ సింహ గర్జన సభ నిర్వహించి, ఆపై పార్లమెంటు ముట్టడికి సిద్ధపడతామని,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు. ఈనెల 28వ తేదీ మహారాష్ట్ర చంద్రపూర్ లో జరిగిన ఓబీసీ మహా ర్యాలీ భారీ బహిరంగ సభలలో పాల్గొని నేడు స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో ఆ విశేషాలను వివరిస్తూ, నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ మేరకు భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు.




ఇంకా వారు దేశంలోని అన్ని ఓబీసీ సంఘాలు కలిసి" రాష్ట్రీయ ఓబీసీ మహా సంఘ్ " ఆధ్వర్యంలో చంద్రపూర్ జిల్లా కేంద్రం గాంధీ చౌక్ నుండి జిల్లా కలెక్టరేట్ వరకు వేలాది మందితో మహా ర్యాలీని నిర్వహించామన్నారు. మహా ర్యాలీ అనంతరం జిల్లా కలెక్టరేట్ మైదానంలో భారీ బహిరంగ సభ జరిగిందన్నారు.ర్యాలీ పొడవునా దేశవ్యాప్త ఓబీసీల సమస్యలపై నినదిస్తూ,అనేక కళారూపాలను ప్రదర్శిస్తూ ఉత్సాహభరితంగా మహా ర్యాలీభారీ బహిరంగ సభలు జరిగాయన్నారు. డిసెంబర్ నెలలో ఢిల్లీ రామ్ లీలా మైదానంలో లక్షలాది మందితో ఓబిసి సింహ గర్జన సభ నిర్వహించాలని జాతీయ నాయకత్వం నిర్ణయించిందన్నారు. ఓబీసీల డిమాండ్ల సాధన కోసం రైతు ఉద్యమం తరహాలో ఢిల్లీలోని ఎర్రకోటను ముట్టడించాలని మరో తీర్మానం ఆమోదించిందన్నారు.

## .ఉపాధి హామీ పాత చట్టాన్ని పునరుద్ధరించాలి. విబిజిరాంజీ పథకం రద్దు చేయాలి.

పెదనందిపాడు జూన్ 29 (ప్రభాతవార్త)ఉపాధి హామీ పాత చట్టాన్ని పునరుద్ధరించాలని, కొత్త పథకం రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఉపాధి హామీ కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు పెదనందిపాడు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం, యాంత్రికరణ పెరగడంతో గ్రామీణ పేదలకు పనులు తగ్గిపోతున్నాయని, తమ ఆదాయాల కంటే ఖర్చులు పెరిగి అప్పుల పాలవుతున్నారని, గ్రామాల నుంచి వలస పోతున్నారని తెలిపారు. ఈ పరిస్థితిలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు పెద్ద ఆసరాగా ఉందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి



ప్రభుత్వం పాత చట్టాన్ని రద్దుచేసి, కొత్తగా విబిజిరాంజీ పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ కొత్త పథకం పేదల పొట్ట కొట్టేలా ఉందని తెలిపారు. గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని పేరు మార్చి, 125 రోజులకు పెంచామని చెప్పిన ప్రభుత్వం, నిధుల కేటాయింపులు మాత్రం తగ్గించిందని చెప్పారు. గత చట్టంలో ఉన్న గ్యారెంటీని రద్దు చేసిందని, ఎప్పుడు పని అడిగితే అప్పుడు కల్పించే స్థానంలో రెండు నెలలు పనికి సెలవు ప్రకటించిందని తెలిపారు. పాత చట్టంలో కేంద్రం వాటా 90 శాతం, రాష్ట్రం వాటా 10 శాతం ఉంటే, కొత్త చట్టం ప్రకారం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధుల కేటాయింపులు భరించేలా మార్పులు తెచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులు కేటాయించలేక చేతులు ఎత్తివేసే పరిస్థితులు నెలకొన్నాయి అన్నారు. అదేవిధంగా మాన్యువల్ గా హాజరు వేసే స్థానంలో, ఫేస్ యాప్ తీసుకువచ్చారని, దీనివల్ల కొన్నిచోట్ల నెట్ సౌకర్యం లేక గంటల తరబడి హాజరు పడక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాత చట్టాన్ని పునరుద్ధరించి, ఉపాధి పనిలో గతంలో ఇచ్చిన ప్రోత్సాహాలు కల్పించాలని కోరారు. ఉపాధి హామీకి రాష్ట్రానికి అవసరమైన పదివేల కోట్లు కేంద్రం నిధులు కేటాయించాలని, సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలని, పని ప్రాంతంలో మంచినీళ్లు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని, 30 రోజులు పని చేసిన ప్రతి కుటుంబానికి పనిముట్లు, ప్రతి గ్రూపుకు టెంటు, మెడికల్ కిట్టు ఇవ్వాలని, ఉపాధి కూలీలు ప్రమాదంలో మరణిస్తే 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని,ఫేస్ యాప్ రద్దు చేయాలని, పే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200, రోజుల పని, 600 రూపాయల వేతనం ఇవ్వాలని, పని ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్న వారికి పని కల్పించకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పాత బకాయిలు, పెండింగ్ వేతనాలు వెంటనే ఇప్పించాలని కోరారు. నిరసన కార్యక్రమం అనంతరం గ్రీవెన్స్ ఇంచార్జ్ ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు నల్లమోతు రాజేంద్ర, రైతు సంఘం మండల అధ్యక్షులు పసుపులేటి శేషగిరి రావు, పోపూరి సుధీర్, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, అన్నల దాసు ఆశీర్వాదం, దేవరకొండ శ్రీనివాసరావు, పి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రైతు మిత్ర, కౌలు రైతు గ్రూపులకు బ్యాంకు రుణాల చెల్లింపులో సమయం ఇవ్వాలి. కౌలు రైతు సంఘం

పెదనందిపాడు జూన్ 29 (ప్రభాతవార్త) రైతు మిత్ర, కౌలు రైతు గ్రూపులకు బ్యాంకు రుణాల చెల్లింపులో సమయం ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు కోరారు. సోమవారం పుసులూరు, పవిడి వారి పాలెం గ్రామాలకు చెందిన రైతు మిత్ర గ్రూపుల సభ్యులు కౌలు రైతు సంఘను సంప్రదించడంతో బ్యాంకు మేనేజర్ తో చర్చలు జరపడానికి నాయకులు వెళ్లారు.ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ గత మూడు, నాలుగు సంవత్సరాలుగా కౌలు రైతులు తుఫానులు,కరువు పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్నారని తెలిపారు.ఈ క్రమంలో బ్యాంకులకు అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. బ్యాంకు మేనేజర్లు సహృదయం తో కౌలు రైతుల సమస్యలు అర్థం చేసుకోవాలని కోరారు. రుణాల చెల్లింపులో వారికి సమయం



ఇవ్వాలని కోరారు. బరోడా బ్యాంక్ మేనేజర్ స్పందిస్తూ ఇప్పుడు కొంత మొత్తం చెల్లిస్తే, మిగతా అప్పు చెల్లించడానికి సమయం ఇస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కందుల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు పసుపులేటి శేషగిరిరావు, పోపూరి సుధీర్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు నల్లమోతు రాజేంద్ర, జంపని రామారావు, పి భువనేశ్వరి, ఎస్ జ్యోతి కుమారి రైతు మిత్ర గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే ఎమ్మెల్యే రామాంజనేయులు.

ప్రత్తిపాడు, జూన్ 29, ప్రభాతవార్త : రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలిచేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే, పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. గుంటూరు రూరల్ మండలం, లాం గ్రామం, ఆచార్య ఎంజి రంగా వ్యవసాయ విద్యాలయం నందు ఏరువాక పౌర్ణమి మరియు ఖేత్ బచావో అభియాన్ ఉత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి



ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాటా డుతూ..భూమిని తల్లిగా భావించి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే పవిత్రమైన రోజు ఏరువాక పౌర్ణమి అన్నారు. రైతుల కష్టానికి, వారి జీవన విధానానికి అద్దంపట్టే ఈ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సాగునీటి వనరులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని భావిస్తున్న కూటమి ప్రభుత్వం, ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతు కష్టానికి తగిన గౌరవం, పంటలకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. రైతే దేశానికి వెన్నెముకని, రైతాంగం సుభిక్షంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని నమ్మిన ఇద్దరు వ్యక్తులు సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడని చెప్పారు. ఈ ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రతి రైతు కుటుంబంలో సుఖశాంతులు, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# బాపట్లలో వైభవంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

## వందలాది ట్రాక్టర్లతో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ భారీ ర్యాలీ

బాపట్ల,జూన్29,ప్రభాతవార్త,ప్రతినిధి: తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచే ఏరువాక పౌర్ణమి వేడుకలను బాపట్ల నియోజకవర్గంలో సోమవారం అత్యంత వైభవంగా, కోలాహలంగా నిర్వహించారు. రైతన్నల పండుగను పురస్కరించుకుని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ట్రాక్టర్ల ర్యాలీ నియోజకవర్గంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాపట్ల పట్టణం నుంచి అప్పికట్ల గ్రామం వరకు సాగిన ఈ ప్రదర్శన ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది.రైతు సంక్షేమమే ధ్యేయంగా సాగిన ఈ భారీ ర్యాలీలో నియోజకవర్గంలోని నలుమూలల నుంచి రైతన్నలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వందలాది ట్రాక్టర్లతో రైతులు తరలిరావడంతో బాపట్లనుంచిఅప్పికట్ల వరకు రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి .రంగురంగుల జెండాలు, అలంకరించిన ట్రాక్టర్లతో రహదారులన్నీ పండగ వాతావరణాన్ని తలపించాయి.ర్యాలీ పొడవునా రైతులు, కూటమి కార్యకర్తలు చేసినజై కిసాన్.జైజై కిసాన్ నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది.నాగలి పట్టిన





ఎమ్మెల్యేర్యాలీ అనంతరం అప్పికట్ల గ్రామ శివాలయం సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో వేడుకలు అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే నరేంద్ర వర్మఇక్కడ ప్రత్యేక భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన నేలతల్లికిసాష్టాంగ నమస్కారం చేసి,భూమాత ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం సాంప్రదాయ పద్ధతిలో ఎడ్ల నాగలి పట్టి పొలాన్ని దున్నారు.ఆ తర్వాత ఆధునిక పద్ధతిలో ట్రాక్టర్‌తోనూ పొలాన్ని దున్నారు. ఒకవైపు పురాతన సాంప్రదాయాన్ని గౌరవిస్తూనే,మరోవైపఆధునిక వ్యవసాయ విధానాలను ప్రతిబింబించేలా ఆయనఈ ఏడాది సాగు పనులను ఉత్సాహంగా ప్రారంభించడం అక్కడికి వచ్చిన రైతులను విశేషంగా ఆకట్టుకుంది.

**రైతే రాజు.. సాగునీరు, విత్తనాలకు ఢోకా లేదు:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూరైతే రాజు అనే నినాదానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఏరువాక పౌర్ణమి వంటి పవిత్రమైన రోజున కలిసి సాగుపనులుప్రారంభించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, ప్రతి రైతన్న ఇల్లు సిరిసంపదలతో తులతూగాలని ఆ భగవంతుడిని ప్రార్థించానన్నారు.నియోజకవర్గంలోని రైతాంగానికి సాగు నీరు,విత్తనాలు,ఎరువులకొరత లేకుండా ప్రభుత్వం తరఫున అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల కష్టాల్లో తోడుగా ఉంటూవారికి నిరంతరంఅండగా నిలుస్తామన్నారు.

**తరలివచ్చిన జనవాహిని:** తెలుగు పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించిన ఈ మహోత్సవంలో నియోజకవర్గ ప్రముఖ నాయకులు, వేలాది మంది రైతులు, కూటమి శ్రేణులు, ప్రజాప్రతినిధులు మరియు ఎమ్మెల్యే అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గ చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున ఏరువాక వేడుకలు జరగడం ఇదే ప్రథమమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యుత్ రంగ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బాపట్ల,జూన్29,ప్రభాతవార్త,ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు,కాంట్రాక్ట్,ఔట్సోర్సింగ్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలనుతక్షణమేపరిష్కరించాలని డిమాండ్ చేస్తూఎ.పి. విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా సీఐటీయూ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. బాబురావు మాట్లాడుతూవిద్యుత్ సంస్థల్లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులుగా, జెఎల్‌ఎం గ్రేడ్2, మీటర్ రీడర్లు, కంప్యూటర్ ఆపరేటర్లుగా వేలాది మంది ప్రాణాలనుపణంగా పెట్టి రాత్రింబవళ్ల విధులు నిర్వహిస్తున్నారన్నారు.అయినప్పటికీ వారి సమస్యలు దశాబ్దాలుగా పెండింగ్‌లోనేఉండటం ఆవేదన కలిగిస్తోందన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ తక్షణమే రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇస్తూ కనీస వేతనం రూ.48,000గా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. వేజ్ రివిజన్ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి,పెండింగ్ డీఏలను ఒకే విడతలో విడుదల చేయాలన్నారు.ఉద్యోగులు, కార్మికులందరికీ నగదురహిత, అపరిమితఆరోగ్య పాలసీని అమలు చేయాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానాలను పూర్తిగా నిలిపివేయాలని కోరారు.యూనియన్ సంఘ నాయకులు బోర్ర సురేష్ మాట్లాడుతూ ఓఅండ్ఎం ఉద్యోగులకు అదనంగా 30 రిస్క్ అలవెన్స్,పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు ఇ.పి.యఫ్ నుండి జి.పి. యఫ్ గామార్పు చేసిఅందరికీ పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఏపీజెన్‌కోలోగత 25 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న జె.పి.ఎలకు ఎలాంటి పదోన్నతి కల్పించనందున వారికి పి.ఎ.లుగా పదోన్నతి కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతాలలో విధులు నిర్వహించే అన్ని కంపెనీల కాంట్రాక్టు కార్మికులకు ఏజెన్సీ అలవెన్సులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీట్రాన్స్‌కోలో పనిచేసే సి.బి.డి.జి విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఎలాంటి షరతులు లేకుండా కారుణ్య నియామకాల కింద ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కోలా శరత్, యూనియన్ ముఖ్య నాయకులు జె.రమేష్, కె.శ్రీనివాసు, రాంబాబు, సత్యం, వి. వినోద్ తదితరులు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు సమస్యలను వివరించారు.

## బాపట్లలో జనసేన బలోపేతమే ధ్యేయం

### జనసేన సంస్థాగత నిర్మాణ పరిశీలకులు, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

బాపట్ల,జూన్29,ప్రభాతవార్త,ప్రతినిధి: జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి ఒక్క కార్యకర్త భాగస్వాములు కావాలని, పార్టీ బలోపేతమే ధ్యేయంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాజోలు శాసనసభ్యులు, బాపట్ల పార్లమెంటరీ జనసేన పార్టీ సమాచార సేకరణ కమిటీ పరిశీలకులు దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం బాపట్లలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపంలో బాపట్ల పార్లమెంటరీ జనసేన పార్టీ నిర్మాణ సారథులు, సమాచార సేకరణ కార్యక్రమం




నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, కమిటీ సభ్యులకు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఇందులో భాగంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించేందుకు ఆసక్తి గల కార్యకర్తలు, నాయకుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఐదు రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మీడియాతో మాట్లాడుతూపార్టీలో ఉన్న ప్రతి కార్యకర్త, నాయకుడు రాజకీయంగా ఎదగాలన్నదే జనసేన ఆశయమన్నారు. ఉత్సాహం కలిగిన వారు పార్లమెంటరీ స్థాయి నుండి మండల స్థాయి వరకు ఉన్న వివిధ పదవులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.ఏ రాజకీయ పార్టీ చేయనివిధంగా పూర్తి ఓపెన్ గా, ప్రజాస్వామ్యబద్ధంగా ఈ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను చేపట్టడం జరిగిందన్నారు.ఈనెల 29 నుండి వచ్చే నెల (జూలై) 3వ తేదీ వరకు ఐదు రోజుల పాటు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిరంతరాయంగా జరుగుతుందన్నారు.కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇక్కడ సేకరించిన దరఖాస్తులన్నింటినీ నిష్పక్షపాతంగా రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పంపిస్తామని, పదవుల కేటాయింపుపై తుది నిర్ణయం పార్టీ అధినేత నిర్ణయమేరకే ఉంటుందని స్పష్టం చేశారు.రాజకీయంగా ఎదిగేందుకు పార్టీ కల్పిస్తున్న ఈ సువర్ణావకాశాన్ని వినియోగించుకునేందుకు నియోజకవర్గ నలుమూలల నుండి జనసైనికులు భారీగా తరలివచ్చారు. దరఖాస్తులు సమర్పించేందుకు కార్యకర్తలు ఉత్సాహం చూపించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ,జనసేన సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,బాపట్ల పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయకర్తలు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేత ఏట్రవారి పాలెం..

కర్లపాలెం,జూన్29,ప్రభాతవార్త: కర్లపాలెం మండలం కట్టావాద గ్రామములో నిర్వహించిన కోన ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ముగిసింది. మొదటి బహుమతిని కర్లపాలెం మండలం ఎట్రావారిపాలెం పులుగు శ్రీనివాసరెడ్డి మెమోరియల్ టీం, రెండవ బహుమతిని కట్టావాద టీం సాధించాయి. ఈ సందర్భంగా బహుమతులు ప్రధానం చేసిన మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ యువకులు క్రీడలలో అధికంగా పాల్గొంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు క్రీడల పట్ల మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా ఎదిగి బాపట్ల ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు ఈ సందర్భంగా విజేతలకు

## ఏ ఎమ్ రెడ్డి కళాశాలలో అంతర్జాతీయ బ్రెయిన్ సింపోసియం కార్యక్రమం

నరసరావుపేట, జూన్ 29, ప్రభాతవార్త: : మండలంలోని పెట్లూరి వారి పాలెం గ్రామం నందు ఎ యం రెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల లో సోమవారం మూడు రోజుల అంతర్జాతీయ బ్రెయిన్ సింపోసియం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమెరికాకు చెందినటువంటి బ్రెయిన్ రీసెర్చ్ మెథడిస్ట్ డాక్టర్ మురళీధర్ హెగ్డే,జపాన్ కు చెందిన ప్రొఫెసర్ మోసాకో కినోషిత పాల్గొన్నారు. కళాశాల ఛైర్మన్ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి వ ర్య వే క్షిం చా రు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మురళీధర్ హెగ్డే మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి మానవుడు తన యొక్క




మెదడును అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్తులో మెదడు సంబంధిత వ్యాధులకు జీన్ థెరపీ ద్వారా చికిత్స మార్గాలు ఉన్నాయని తెలియజేశారు. జపాన్ కు చెందిన ప్రముఖ రీసెర్చ్ పరిశోధనవేత్త మస్సాకు కినోషిత మాట్లాడుతూ వ్యాధి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఆల్జీమర్స్ వ్యాధి అన్ని వయసుల వారికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.కాగ్నిటివ్ డిస్ ఫంక్షన్స్ వంటి అనేక అంశాల పైన విద్యార్థి దశలోనే పరిశోధనలు జరగాలని అటువంటి పరిశోధనలకు ఈ మూడు రోజుల అంతర్జాతీయ సింపోసియం వేదికగా నిలుస్తుందని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైనటువంటి కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్ జగన్నాథ రావు మాట్లాడుతూ విద్యార్థులు వారి యొక్క శక్తి సామర్థ్యాలను తెలుసుకోవడంలో మెదడు ప్రప్రదమమైనదని అటువంటి మెదడు పైన జరుగుతున్నటువంటి నూతన ఆవిష్కరణలు మెదడుకు కలుగుతున్నటువంటి డిజార్డర్స్ పట్ల విద్యార్థులకు అవగాహన అవసరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అనేక పరిశోధనలకు విద్యార్థిని విద్యార్థులకు అవకాశాలు మెండుగా ఉన్నాయని వీటిని విద్యార్థిని విద్యార్థులు అర్థం చేసుకొని పరిశోధనల పట్ల ఆసక్తి చూపాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించినటువంటి కళాశాల కార్యదర్శి డాక్టర్ అట్లూరు శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ మరియు అనుసంధాన్ నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ వారి సహకారంతో మొట్టమొదటిసారిగా ఏ యం రెడ్డి స్పార్క్ ఫార్మసీ కళాశాల నిండు మూడు రోజుల అంతర్జాతీయ సింపోసియం ఆన్ న్యూ డిస్కవరీస్ ఇన్ బ్రెయిన్ మరియు డిసార్డర్స్ అనే అంశంపై తమ కళాశాల వేదిక అవ్వటం ఎంతో గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో ఏఎం రెడ్డి విద్యాసంస్థల గ్లోబల్ సెక్రటరీ అట్లూరి మానస్ రెడ్డి ,లలిత సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత్రి డాక్టర్ విజయ , యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కే తేజోమూర్తి , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి భార్గవ్ భూషణరావు, అకాడమిక్ డీన్ ఏ పావని, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపక అధ్యాపకేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే డా. చదలవాడ

నరసరావుపేట, జూన్ 29 ప్రభాతవార్త :: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా తీర్చిదిద్దేందుకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. మండలంలోని కేతముక్కల అగ్రహారం గ్రామంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వ ఏరువాక కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు రైతులతో కలిసి నాగలి పట్టి పొలంలో దున్ని ఖరీఫ్ సాగుకు శ్రీకారం చుట్టారు. గ్రామంలో రైతులు, రైతు సంఘాల నాయకులు, డీసీఎంఎస్ సభ్యులు, కూటమి నాయకులు ఎడ్లబండ్లు, నాగళ్లతో పొలం గట్ల వెంట ఊరేగింపుగా ఏరువాక నిర్వహించారు. "ఏరువాక సాగారో రైతన్నా" పాటలు పాడుతూ పండుగ వాతావరణంలో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరువాక అనేది తెలుగు రైతు సంస్కృతికి ప్రతీక అని, వ్యవసాయ సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే గొప్ప పండుగ అన్నారు. జీడీఎంఎస్ బ్యాంకు ఛైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు పల్నాడు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సంఘాల నాయకులు, ఉమ్మడి కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తాం:ఆర్డీవో శ్రీదేవి

రేపల్లె, జూన్ 29, ప్రభాతవార్త:పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 7 అర్జీలు అందినట్లు ఆర్డీవో బి.శ్రీదేవి చెప్పారు.రేపల్లె పురపాలక సంఘంలోని 8వ వార్డులో మంచినీటి సరఫరా చేయించాలని ఆలూరు సరోజిని అర్జీ అందజేశారు.రేపల్లెలో విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్న ప్రైవేటు స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఓలేటి రాఘవయ్య ఫిర్యాదు చేశారు.విద్యుత్ స్తంభాలు,వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని భట్టిప్రోలు మండలంలోని గొరిగపూడి గ్రామానికి చెందిన ధూళిపూడి ప్రశాంత్ అర్జీ అందజేశారు.భూములను సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని వేమూరు మండలంలోని చంపాడుకు చెందిన కేసాని సాంబశివరావు, కేసాని జ్యోతిలు అర్జీ అందజేశారు.భూమికి ఆధార్ లింకు చేయించాలని నిజాంపట్నం మండలంలోని ఆముదాలపల్లికి చెందిన పలగాని మాధవి అర్జీ అందజేశారు.భూమిని అడంగల్‌లో నమోదు చేయించాలని కొల్లూరు మండలంలోని అనంతవరంకు చెందిన కన్నెగంటి నాగేశ్వరరావు అర్జీ సమర్పించారు.నగరం మండలంలోని అల్లపర్రు రెవెన్యూ పరిధిలో తమ భూముల నుండి మురుగునీరు పోవుటకు తగిన ఏర్పాట్లు చేయించాలని రేపల్లె మండలంలోని నల్లూరిపాలెంకు చెందిన ప్రజలు అర్జీ అందజేశారు.ప్రజల నుంచి అందిన అర్జీలను పరిశీలించి పరిష్కార మార్గం చూపుతామని ఆర్డీవో బి.శ్రీదేవి తెలిపారు.



## ఉక్కు బాధిత కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

రేపల్లె, జూన్ 29, ప్రభాతవార్త:విశాఖ ఉక్కు బాధిత కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బాపట్ల జిల్లా ఎఐటియుసి అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.సోమవారం పట్టణంలోని ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సిపిఐ జిల్లా నాయకుడు కన్నెగంటి రమేష్‌బాబు,జిల్లా రైతు కూలీ సంఘం కార్యదర్శి చెరుకూరి లక్ష్మణరావు,రైతు కూలీ సంఘం నాయకుడు మోపిదేవి ఈశ్వరరావు,రేపల్లె మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకుడు సమ్మెట శ్రీనివాసరావు,జిల్లా ఎఐటియుసి ఉపాధ్యక్షుడు పడమటి బిక్షాలు,జిల్లా రైతు కూలీ సంఘం నాయకుడు చందోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీవితం ఎంతో విలువైనది: సిడిపివో సుచిత్ర

రేపల్లె, జూన్ 29, ప్రభాతవార్త:జీవితం ఎంతో విలువైనదని ఆత్మహత్యల జోలికి పోరాదనే వాస్తవాన్ని గుర్తించాలని రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో ఎం.సుచిత్ర అన్నారు.సోమవారం పురపాలక సంఘంలోని ఆంధ్రరత్న ఉన్నత పాఠశాలలో "జీవితం అమూల్యమైనది–ఆత్మహత్యల నివారణ" అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్,సూపర్ వైజర్ సి.హిమబిందు,డిసిపియు యూనిట్ సిబ్బంది కృష్ణ,స్వప్న ప్రియ,ఉపాధ్యాయులు మాధవి,ఎస్.వి.రమణ,పి.రాము,ఐ.వందన,ఐ.వి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలి:ఎమ్మెల్యే ఆనందబాబు

చుండూరు(రేపల్లె), జూన్ 29, ప్రభాతవార్త:భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ దేవాలయం అభివృద్ధికి కృషి చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు.సోమవారం చుండూరు మండలం కొత్తపల్లి నారికేళ్ళపల్లి గ్రామంలో శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి కోసం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో దేవాలయ అభివృద్ధి నూతన కమిటీ ప్రమాణ స్వీకారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగం అభివృద్ధిలో భాగంగా దేవాలయాలను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నదని చెప్పారు.శ్రీ మల్లేశ్వరస్వామి దేవాలయం ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు.దేవాలయ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే ఆనందబాబు అభినందించారు.



## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: తెనాలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని పొన్నూరు, పెదకాకాని, చేబ్రోలు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టుల భర్తీకి అర్హులైన వారి వద్దనుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐసిడిఎస్ సీడీపిఓ చెప్పారు. పొన్నూరు మండల పరిధిలోని చింతలపూడి,దొప్పలపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల నియామకానికి ఓసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యకర్త పోస్టుకు 21–35సంవత్సరాల వయస్సు గలవారై ఉండాలన్నారు. పదవ తరగతి పాసై స్థానికంగా ఉండాలి. అదేవిధంగా చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో సహాయకురాలు పోస్టులకు శేకూరుపాలెం ఎస్సీకి, తక్కెళ్ళపాడు గ్రామంలో ఓసికి రిజర్వేషన్ కేటాయించినట్లు చెప్పారు. ఏడవ తరగతి పాసై స్థానికంగా ఉన్నటువంటి వివాహితురాలై ఉండాలన్నారు. వివరాలకు ఐసీడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో స ంప్రదించాలన్నారు.



మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి బహుమతులు ప్రధానం చేశారు. మొదటి బహుమతిని ప్రముఖ ఆక్వా వ్యాపారవేత్త చెన్నుపాటి జనార్ధన్, రెండవ బహుమతిని లంక వెంకటేశ్వర రెడ్డి, మూడవ బహుమతి మార్పు రత్నం స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏడుకొండలు వైసిపి నాయకులు బెనర్జీ, గోవా తోటి సుబ్బారావు, శ్రీనివాసరావు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

## అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం నవతరం పార్టీ కృషి

కర్లపాలెం,జూన్29,ప్రభాతవార్త:

బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన గత 7 సంవత్సరాలుగా నిలిచిపోయిన అంబేద్కర్ భవనం నిర్మించాలననే కార్యక్రమంలో భాగంగా ఈ రోజు 10వ సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నవతరం పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు ఎస్. కె కరీం మరియు నవతరం పార్టీ చీరాల అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దామర్ల ప్రకాష్ బాబు విచ్చేసి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ.డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ గారు ఒక వ్యక్తి కాదని,ఆయన రాసిన భారత రాజ్యాంగం ద్వారా ఈ రోజు దేశంలో ఎన్నో లక్షలఉద్యోగాలు పొంది ఐఎస్ఎస్,ఐపీఎస్,రెవిన్యూ,పోలీస్ వంటి ఉద్యోగాల్లో లక్షలమంది కొలువై ఉన్నారని అన్నారు.కర్లపాలెం మండల కేంద్రంలో నిర్మించతలపెట్టిన డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ గారి భవనం నిర్మాణం పూర్తి చేయకుండా గత ఏడు ఏళ్లుగా శిధిలావస్థలో ఉంచడం అత్యంత బాధకరమని అన్నారు.ప్రజలకు ఉపయోగపడే ఈ భవన్ ను బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ,బాపట్ల పార్లమెంట్ సభ్యులు తేన్నేటి కృష్ణ ప్రసాద్ చిత్తశుద్ధితో నిర్మాణం పూర్తి చేసి డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ అభిమానుల కలలను సాకారం చేస్తారని భావిస్తున్నానని చెప్పారు.ఈ భవనం గురించి త్వరలో బాపట్ల శాసనసభ్యులు, ఎంపీలను కలిసి వినతి పత్రం ఇస్తామని తెలియజేశారు.కార్యక్రమంలో దళిత నాయకులు బోరుగడ్డ జీవన్, మురళికృష్ణ పాల్గొన్నారు...



## రూ.16.57లక్షలు హుండీ ఆదాయం

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయంలో సోమవారం స్వామివారికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించినట్లు కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు తెలిపారు. దేవాలయంలోని అన్ని హుండీలను తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.16,57,950ఆదాయం సమకూరిందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని బాపట్ల దేవాదాధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.గోపినాథ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుప్తా, డైరెక్టర్లు కత్తుల రవికిరణ్, టి.శ్రీలక్ష్మి, కలపాల విజయలక్ష్మి, ఏ.వాసంతి, సిహెచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవాలయంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు దాతల సహకారాన్ని కోరుతున్నట్లు చెప్పారు. దాతలు ముందుకు వచ్చి దేవాలయం అభివృద్ధికి సహకరించాలని కోరారు.



## వివిధ కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందన

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: నిడుబ్రోలు పిబిఎన్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించాక వివిధ కోర్సుల్లో చేరేందుకు పలువురు విద్యార్థినీ విద్యార్థులు సీట్లు సాధించారు. ఆ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివకుమారి నేతృత్వంలో అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు. కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన జి.నూతన ఐఐటీలో ర్యాంకు సాధించింది. ఎన్ఐటీ సూరత్‌లో సీటు సాధించిన జె.జాహ్నవి, బికామ్ కోర్సు ద్వారా అప్రెంటిషిప్ సాధించిన మరో తొమ్మిది మంది విద్యార్థినీ విద్యార్థులకు అభినందించారు. భవిష్యత్తులో బాగా చదివి కీర్తిప్రతిష్టలు సాధించాలని, తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని సూచించారు. సాధారణ స్థాయి విద్యార్థులతో అత్యుత్తమ, అద్భుత ఫలితాలు సాధించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ చిత్తరంజన్, కళాశాల ప్రెసిడెంట్ కెప్టెన్ నన్నపనేని అంకప్ప చౌదరి, కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని అన్నారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎలక్ట్రికల్ సేఫ్టీ ప్రమాణాలు తప్పక పాటించాలి

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: వినియోగదారులందరూ ఎలక్ట్రికల్ సేఫ్టీ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపి ఎలక్ట్రికల్ సేఫ్టీ డైరెక్టరేట్, సీఈఐజీ జీ.విజయలక్ష్మి సూచించారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈఈఈ విభాగంలో ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్, ఏపి ప్రభుత్వ ఎలక్ట్రికల్ సేఫ్టీ డైరెక్టరేట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం లారా గ్రీన్ ఫీల్డ్‌లో ఎర్తింగ్ అండ్ ఎల క్ట్రికల్ సేఫ్టీ అంశంపై వర్సిటీ సమీపంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీ.విజయలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటార్ స్టార్టర్లు, స్విచ్‌లు అమర్చిన ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మోటర్లు పనిచేయని సందర్భాల్లో రైతులు స్వయంగా విత్యుత్ స్తంభాలు లేదా ట్రాన్స్‌ఫార్మర్లపైకి ఎక్కి మరమ్మత్తులు చేయడానికి ప్రయత్రించరాదన్నారు. పొలాల్లో తెగిపడిన లేదా తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలకు దూరంగా ఉండి, సంబంధిత విద్యుత్ సిబ్బందికి, గ్రామ సచివాలయాల్లోని ఎనర్జీ అసిస్టెంట్లకు సమాచారం అందించాలని తెలిపారు. చిన్నారులు విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్ళలో, వాణిజ్య సంస్థల్లో లూజ్ ఎర్త్ కనెక్షన్లు, లూజ్ వైరింగ్ లేకుండా శాశ్వత ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ తీగలు ప్రయాణించే వాహనాలపై ప్రమాదవశాత్తు పడినట్లయితే వాహనం విద్యుత్ లైన్లను తాకినట్లయితే, వాహనం నుంచి కాళ్ళు కలపకుండా హోపింగ్(గెంతుతూ బయటకు వచ్చే) విధానాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు ఇన్‌స్పెక్టర్ వై.ప్రసాద్, డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ విద్య, ఎండీ హుస్సేన్,. విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విభాగల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎలక్ట్రికల్ యెమింటెనెన్స సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



## కృత్రిమ అవయవాలకు 11మంది ఎంపిక

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: నిడుబ్రోలు డీవీసి ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన దివ్యాంగులకు సంబంధించిన కృత్రిమ అవయవాలు పొందేందుకు నిర్వహించిన శిబిరానికి 11మంది ఎంపికయినట్లు ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. మోకాలి పైభాగం వరకు అవయవాలు కోల్పోయిన ఆర్థోపెడిక్ వికలాంగులకు మాత్రమే కృత్రిమ అవయవాలు, కాలిపర్స్ పంపిణీకి ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలింకో సంస్థ సహకారంతో జిల్లాలో అర్హత ఉన్న దివ్యాంగుల ఎంపిక కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## ప్రజలకు మౌళిక వసతుల కల్పనే ధ్యేయం

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: ప్రజలకు మౌళిక వసతుల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. నిడుబ్రోలు చేపల సొసైటీ వద్ద గల మొండి కాలువ పూడిక తీత పనులను సోమవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ మునిసిపల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యలకు శాశ్విత పరిష్కారం చూపించేందుకు, పట్టణ పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో డ్రైనేజి కాలువ అభివృద్ధి పనులను ప్రారంభించామన్నారు. అభివృద్ధి పనులు పూర్తయ్యాక మురుగునీటి పారుదల వ్యవస్థ మరింత మెరుగుపడి, రహదారులపై నీరు నిల్వ ఉండకుండా నివారించబడటంతోపాటు దోమలు,, దుర్వాసనలు, అంటువ్యాధులు వ్యాప్తి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మునిసిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, మునిసిపల్ డిఇ వెంకయ్య, నాయకులు జాగర్లమూడి సుధీర్, నన్నపనేని మధుకర్, ఎద్దు సోంబాబు తదితరులున్నారు.



## సహకార వ్యవస్థ రైతుల పాలిట వరం

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: సహకార వ్యవస్థ రైతుల పాలిట వరమని జీడీసిఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు అన్నారు. జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ప్రధాన కార్యాలయంలో సహకారంతో సమృద్ధి వార్షికోత్సవాల కార్యక్రమంలో హరిబాబు మాట్లాడారు. తొలుత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయవందనం చేశారు. హరిబాబు మాట్లాడుతూ సహకార వ్యవస్థ రైతులకు బలమైన ఆధారమన్నారు. రైతుల అభివృద్ధి కోసం కోఆపరేటివ్ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సకాలంలో అందిస్తూ వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. అదేవిధంగా రైతులు పండించిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేవిధంగా కూడా సంస్థ పనిచేస్తోందన్నారు. సహకారంతో సమృద్ధి సాధ్యమని, రైతు సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసిఎమ్మెస్ బిజినెస్ మేనేజర్ జేవీ సుబ్బారావు, ఆఫీస్ మేనేజర్ శ్రీనివాసరావు, సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పీజీఆర్ఎస్‌కు ఎనిమిది అర్జీలు

పొన్నూరు, జూన్ 29,ప్రభాతవార్త: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు ఎనిమిది అర్జీలు అందినట్లు ఎండిఓ గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను వివరిస్తూ పంచాయితీరాజ్‌శాఖకు సంబంధించి ఒక అర్జీ, రెవెన్యూశాఖకు సంబంధించి ఒక అర్జీ, విద్యుత్‌శాఖకు సంబంధించి రెండు అర్జీలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి ఒక అర్జీ, మునిసిపాలిటీకి ఒక అర్జీ, రోడ్లు భవనాలశాఖకు, మండల విద్యాశాఖకు చెరో అర్జీ అందినట్లు చెప్పారు.



